# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 20-12-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 ▪ Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:109 పేజీలు:6 వెల: రూ.1/-


**నేటి కందం- నేటికి అందం**

ఓమన్దేశ ప్రభుత్వము
ప్రామినుకులు వల్లెవేయు ప్రథితాత్ముండౌ
శ్రీమన్నరేంద్ర మోడిని
కామారిగ స్వాగతించి గౌరవము నిడెన్ !!

(ఓమన్ దేశం నరేంద్ర మోడీ ని స్వాగతించి ఆదేశపు అత్యున్నత పురస్కారాన్ని యిచ్చి గౌరవించింది.)



-రాధశ్రీ
సెల్:9494481210

**చురక**

పార్టీ మారినోళ్లే నేడు
పచ్చినిజం కాదంటరు
కండువాలు కప్పుకొని
కౌగిలించలేదంటరు
నాడు పవర్లున్నోళ్లే
నేర్పినట్టి గొప్ప విద్య
స్పీకర్ చెప్పిందే తీర్పు
సత్యమికా ఒక మిథ్య



-వేల్పుల నారాయణ
9440433475

# బంగ్లాదేశ్‌లో హింసాకాండ



**-పత్రిక కార్యాలయాల ధ్వంసం**
**-భారత రాయభారి ఇంటిపై రాళ్లదాడి**
**-ఓ హిందువు దారుణ హత్య**
**-మృతదేహం దహన యత్నం**
**-మూకల దాడుల్ని అడ్డుకోండి**
**తాత్కాలిక ప్రధాని యూనస్**

బంగ్లాదేశ్ డిసెంబర్ 19: బంగ్లాదేశ్ అట్టుడుగుతోంది. మూక దాడులతో అల్లకల్లోలమైంది. ఒక వైపు భవనాల పై దాడి. విధ్వంస కాండలో మూకలు చెలరేగిపోతున్నాయి. అంతర్జాతీయ సమాజం సైతం ఆందోళన వ్యక్తం చేస్తోంది. విద్యార్థి నాయకుడు షరీఫ్ ఉస్మాన్ హాది మరణంతో .. జనంలో రగిలిన ఆందోళన.. కాస మత దాడిగా అవతరించింది.

గురువారం అర్ధరాత్రి నుంచి బంగ్లాదేశీయులు అల్లాడిపోతున్నారు. గురువారం రాత్రి రెండు ప్రధాన దినపత్రికల కార్యాలయాలపై మూక దాడి జరిగింది. శుక్రవారం ఉదయం భారత రాయభార కార్యాలయంపై రాళ్ల వర్షం కురిపించారు. ఈ అలజడిపై బంగ్లాదేశ్ తాత్కలిక ప్రధాని యూనస్ తీవ్రంగా స్పందించారు. మూకల విధ్వంసాన్ని తీవ్రంగా ఖండించారు. బంగ్లాదేశ్‌లో ఉద్రిక్త పరిస్థితులపై భారత పార్లమెంటరీ కమిటీ సమీక్ష జరిపింది. బంగ్లాదేశ్‌లో అల్లర్లు కొనసాగుతూనే ఉన్నాయి.

### ప్రతిక కార్యాలయాల దహనం

గురువారం అర్ధరాత్రి నుంచి బంగ్లాదేశ్ హింసాత్మక నిరసనలతో అట్టుడుకుతోంది, జాతీయ ఎన్నికల నేపథ్యంలో బంగ్లాదేశ్?లో మరింత అశాంతి చెలరేగుతుందనే ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. షేక్ హసీనా ప్రభుత్వాన్ని కూల్చివేసిన తిరుగుబాటు విద్యార్థి నాయకుడు షరీఫ్ ఉస్మాన్ హదీన్ గత శుక్రవారం ఢాకాలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించినప్పుడు ముసుగు దుండగులు ఆయనను కాల్చారు. మెరుగైన వైద్యం కోసం హాదీని సింగపూర్‌కు తరలించారు, అక్కడ ఆరు రోజులు చావుబతుకుల్లో కొట్టిమిట్టాడిన ఆయన మరణించారు.

ఈ సమాచారంతో బంగ్లాదేశ్‌లో అలజడి రేగింది. గురువారం నిరసన మూకలు వీధుల్లోకి వచ్చి పత్రికల కార్యాలయాలపై దాడి దిగారు. బంగ్లాదేశ్ వ్యవస్థాపక పితామహుడు షేక్ ముజిబుర్ రెహమాన్ నివాసం 32 ధన్మండిని ధ్వంసం చేశారు. రాజధాని ఢాకాలో అనేక భవనాలు, ప్రముఖ వార్తాపత్రికలు ప్రోథోమ్ అలో (డైలీ స్టార్ భవనాలను ధ్వంసం చేశారు. నిప్పంటించారు. అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. శుక్రకారం తెల్లవారుజామున 1.40 గంటల ప్రాంతంలో డైలీ స్టార్ భవనంలోని మంటలను అగ్నిమాపక సిబ్బంది అదుపులోకి తెచ్చారు, 27 మంది ఉద్యోగులను రక్షించారు. "వార్తాపత్రిక చరిత్రలో మొదటిసారిగా, ప్రచురణను నిలిపివేయాల్సి వచ్చింది" అని కన్సల్టింగ్ ఎడిటర్ కమల్ అహ్మద్ తెలిపారు. ప్రోథోమ్ అలో ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ సజ్జాద్ షరీఫ్ ఈ దాడి మాట్లాడుతూ, పత్రికా స్వేచ్ఛ, వ్యక్తీకరణ, అసమ్మతి అభిప్రాయ వైవిధ్యంపై దాడి జరిగిందన్నారు. ఈ హింస అంతర్జాతీయ ఆందోళనకు దారితీసింది. జర్నలిస్టులను రక్షించే కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. జర్నలిస్టుల భద్రతకు చర్యలు చేపట్టాలని బంగ్లాదేశ్ అధికారులను ఈ కమిటీ కోరింది.





### హైకమిషనర్ ఇంటిపై దాడి

తెల్లవారుజామున 1:30 గంటలకు చటో గ్రామ్‌లోని అసిస్టెంట్ ఇండియన్ హైకమిషనర్ ఇంటిపై ఇటుకలు, రాళ్లను విసిరారు, కానీ ఎటువంటి నష్టం జరగలేదు. పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించారు. లాఠీ ఛార్జ్‌లతో నిరసన మూకల్ని చెదరగొట్టారు. , 12 మంది అదుపులోకి తీసుకున్నారు. తగు చర్య తీసుకుంటామని భారత అసిస్టెంట్ హైకమిషనర్‌కు బంగ్లాదేశ్ సీనియర్ అధికారులు హామీ ఇచ్చారు.

### అసలు ఏం జరిగింది

బంగ్లాదేశ్ నాయకుడు షరీఫ్ ఉస్మాన్ హదీన్ మరణంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలోనే దైవదూషణ ఆరోపణలతో ఒక హిందువును ఒక గుంపు కొట్టి చంపారు. గురువారం రాత్రి స్క్వేర్ మాస్టర్ బారిలోని దుబాలియా పారా ప్రాంతంలో ఈ అమానుష ఘటన జరిగిందని ఓ మీడియా నివేదించింది. గురువారం ఉదయం బంగ్లాదేశ్ ప్రశాంతంగా ఉంది. ఇంక్విలాబ్ మంచా నాయకుడు హదీ మరణాన్ని ధృవీకరించారు. ఇక యువజనం రగిలిపోయారు. గురువారం రాత్రి దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో దాడులు విధ్వంసాలు జరిగాయి.

### ఓ హిందువు ఖతం

భాలుకా ఉపజిల్లాలోని స్క్వేర్ మాస్టర్ బారిలోని దుబాలియా పారా ప్రాంతంలో దీపు చంద్ర దాస్ అనే వ్యక్తిని మూక కొట్టి చంపింది. భాలుకా పోలీస్ స్టేషన్ డ్యూటీ ఆఫీసర్ రిపోన్ మియా కథనం ప్రకారం, "గురువారం రాత్రి 9 గంటల ప్రాంతంలో ప్రవక్తను అవమానించారని ఆగ్రహించిన కొంతమంది వ్యక్తులు ఓ వ్యక్తిని పట్టుకుని కొట్టారు.హూప్

### చందాదారుల కోసం ప్రత్యేక కంటెంట్

ఆ తర్వాత మృతదేహాన్ని చెట్టుకు కట్టేసి నిప్పంటించారు. పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని మైమెన్సింగ్ మెడికల్ కాలేజీ ఆసుపత్రి మార్చురీకి పంపారు. ఇప్పటివరకు ఎటువంటి కేసు నమోదు కాలేదు. అతడి బంధువుల కోసం వెతుకుతున్నాం. బంధువులు ఫిర్యాదు చేస్తే చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటాం" అని రిపోన్ మియా చెప్పారు.ప్రతిఘటించండి

### బంగ్లాదేశ్ తాత్కలిక ప్రధాని యూనస్

హాది మరణంపై స్పందిస్తూ, "హాదీ మరణం దేశ రాజకీయ ప్రజాస్వామ్య రంగానికి తీరని లోటు" అని బంగ్లాదేశ్ తాత్కాలిక నాయకుడు ముహమ్మద్ యూనస్, అన్నారు. హాదీ మరణంపై పారదర్శక దర్యాప్తు జరిపిసామన్నారు. బంగ్లాదేశ్‌లో అశాంతి చెలరేగుతున్న తరుణంలో, ముహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం ప్రజలను మూక హింసను ప్రతిఘటించాలని కోరింది. ఇటువంటి చర్యలు దేశ ప్రజాస్వామ్య ప్రక్రియను దెబ్బతీసే ప్రమాదం ఉందని హెచ్చరించింది. "మైమెన్సింగ్‌లో ఒక హిందూ వ్యక్తిని కొట్టి చంపడాన్ని మేము హృదయపూర్వకంగా ఖండిస్తున్నాం. కొత్త బంగ్లాదేశ్‌లో ఇటువంటి హింసకు చోటు లేదు. ఈ దారుణమైన నేరానికి పాల్పడిన వారిని వదిలిపెట్టబోం" అని ప్రకటనలో పేర్కొంది.

# డీజీపీ ముందు లొంగిపోయిన 41 మంది మావోయిస్టులు





హైదరాబాద్, డిసెంబర్ 19:నిషేధిత సీపీఐ (మావోయిస్టు) పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో 41 మంది మావోయిస్టు ఆయుధాలతో సహా లొంగిపోయారు. వీరిలో ఖఒఉం బటాలియన్, వివిధ డివిజనల్, ఏరియా కమిటీ స్థాయి నాయకులు కూడా ఉన్నారు. మొత్తం 24 ఆయుధాలు, 733 తూటాలు, 8 బీజీఎల్ షెల్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. లొంగిపోయిన మావోయిస్టుల్లో ఇద్దరు తెలంగాణ వాళ్లు ఉండటం గమనార్హం.

పోలీసుల వివరాల ప్రకారం.. లొంగిపోయిన వారిలో ఆరుగురు డివిజనల్/కంపెనీ స్థాయి కమిటీ సభ్యులు, 12 మంది ఏరియా/ప్లాటూన్ కమిటీ సభ్యులు, 23 మంది సాధారణ పార్టీ సభ్యులు ఉన్నారు. ఇన్సాస్ ఎల్ఎంజీ, ఏకే?47, ఎస్ఎల్ఆర్, ఇన్సాస్ రైఫిళ్లు, .303 రైఫిళ్లు తదితర ఆయుధాలు లొంగుబాటులో భాగంగా అప్పగించారు. మావోయిస్టు పార్టీలో సంస్థాగత బలహీనత, నాయకత్వంపై నమ్మకం తగ్గడం, అడవుల్లో తీవ్ర జీవన కష్టాలు, భద్రతా బలగాల ఒత్తిడి కారణంగానే తాము ప్రధాన జనజీవనంలోకి రావాలని నిర్ణయించుకున్నట్లు లొంగిపోయిన మావోయిస్టులు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపుకు స్పందనగా ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు.

### లొంగిపోయిన మావోయిస్టులు అప్పగించిన ఆయుధాలను పరిశీలిస్తున్న డీజీపీ

లొంగిపోయిన వారికి రాష్ట్ర పునరావాస విధానం ప్రకారం డివిజనల్ కమిటీ సభ్యులకు రూ.5 లక్షలు, ఏరియా కమిటీ సభ్యులకు రూ.4 లక్షలు, పార్టీ సభ్యులకు రూ.లక్ష చొప్పున ప్రోత్సాహకం అందించనున్నారు. ఆయుధాలపై అదనపు రివార్డు కూడా ఇవ్వనున్నారు. మొత్తంగా రూ.1.46 కోట్లకు పైగా నగదు ప్రోత్సాహకాలు లభించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ లొంగుబాటుతో తెలంగాణలో మావోయిస్టు కార్యకలాపాలు మరింత బలహీనపడతాయని, మిగిలిన అజ్ఞాత కేడర్లు కూడా హింసను వీడి జనజీవనంలోకి రావాలని పోలీసులు పిలుపునిచ్చారు.

# బయటకు రావొద్దు.. బంగ్లా అల్లర్ల నేపథ్యంలో భారతీయులకు కీలక హెచ్చరిక

న్యూ డిల్లీ డిసెంబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); పొరుగు దేశం బంగ్లాదేశ్‌లో మళ్లీ అల్లర్లు చెలరేగాయి కాల్పుల్లో గాయపడిన బంగ్లాదేశ్‌కు చెందిన సాంస్కృతిక సంస్థ ఇంక్విలాబ్ మంచ్ ప్రతినిధి షరీఫ్ ఉస్మాన్ బిన్ హదీ మృతితో నిరసనకారులు విధ్వంసం సృష్టించారు. ఢాకా సహా పలు నగరాల్లో నిరసనకారులు వీధుల్లోకి వచ్చి పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, మీడియా సంస్థలపై దాడులు చేసి ధ్వంసం చేశారు. భారత్, అవామీలీగ్ పార్టీకి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. తాజా ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో భారత్ అప్రమత్తమైంది. ఈ మేరకు బంగ్లాదేశ్‌లో నివసిస్తున్న భారతీయులకు కీలక అడ్వైజరీ జారీ చేసింది. బంగ్లాదేశ్‌లో నివసిస్తున్న భారతీయులు, భారత విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని బంగ్లాదేశ్‌లోని భారత హైకమిషన్ సూచించింది. అనవసర ప్రయాణాలు చేయొద్దని, అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని హెచ్చరించింది. ఏదైనా సాయం కావాలంటే హైకమిషన్, అసిస్టెంట్ హైకమిషన్ కార్యాలయాలను సంప్రదించాలని సూచించింది. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టు పెట్టింది.

# అమెరికాలోని నార్త్ కరోలినాలో ఘోర విమాన ప్రమాదం.. ఏడుగురు దుర్మరణం

న్యూయార్క్ డిసెంబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: అమెరికాలోని నార్త్ కరోలినా ప్రాంతంలో ఘోర విమాన ప్రమాదం జరిగింది. షార్లెట్‌కు ఉత్తరాన 45 మైళ్ల దూరంలో స్టేట్స్ విల్లే రీజనల్ విమానాశ్రయంలో సి550 జెట్ విమానం ల్యాండ్ అవుతుండగా కుప్పకూలిపోయింది. ఈ ప్రమాదంలో ఏడుగురు దుర్మరణం చెందారు. విమానాశ్రయం తాత్కాలికంగా మూసివేశామని ఎయిర్‌పోర్టు అధికారులు వెల్లడించారు. ప్రమాదం జరిగినప్పుడు కొద్దిపాటి వర్షం కురిసినట్టు సమాచారం. మృతులలో మాజీ నాస్ కార్ డ్రైవర్ స్టార్ గ్రెగ్ బిఫిల్ కూడా ఉన్నారు. విమానం మొదట టేకాఫ్ అయిన తర్వాత వెనక్కి తిప్పడంతో అది కూలిపోయిందని నార్త్ కరోలినా హైవే పెట్రోల్ అధికారులు వెల్లడించారు.

# జనవరిలో న్యూఢిల్లీలో భారత్-ఈయూ సమ్మిట్

**-గణతంత్ర దినోత్సవ వేడుకలకు యూరోపియన్ యూనియన్ నేతలు**

న్యూ దిల్ల్హి డిసెంబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );వచ్చే ఏడాది జనవరి 26వ తేదీన జరగబోయే గణతంత్ర దినోత్సవ వేడుకలకు యూరోపియన్ యూనియన్ నేతలు రాబోతున్నట్టు సమాచారం. ప్రతి సంవత్సరం జనవరి 26న నిర్వహించే గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఏదో ఓ దేశాధినేతని భారత్ ఆహ్వానించడం ఆనవాయితీగా వస్తోంది. తొలిసారిగా బహుళ-దేశాల కూటమికి చెందిన నాయకులు భారత్ రిపబ్లిక్ డే వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరుకాబోతున్నట్టు తెలుస్తోంది. యూరోపియన్ యూనియన్‌తో భారత్ అతిపెద్ద వాణిజ్య ఒప్పందం ఖరారయ్యే దశలో ఉంది. అలాగే భారత్-ఈయూ మధ్య వ్యూహాత్మక భాగస్వామం ఉంది. ఈ నేపథ్యంలో 2026 జనవరి 26న జరిగే గణతంత్ర వేడుకలకు యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయెన్, యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టాను ఆహ్వానించినట్టు వార్తలు వస్తున్నాయి. వచ్చే ఏడాది జనవరిలో న్యూఢిల్లీలో భారత్-ఈయూ సమ్మిట్ జరగనుంది. దాదాపు అదే సమయంలో ఈ నాయకులు భారత్‌కు రాబోతున్నట్టు సమాచారం భారత్-ఈయూల మధ్య చాలా కాలంగా ఉచిత వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరుగుతున్నాయి. వచ్చే ఏడాది జనవరిలో ఈ చర్చల్లోనూ పురోగతి సాధించే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. అమెరికా అధిక సుంకాల నేపథ్యంలో యూరోపియన్ యూనియన్‌తో వాణిజ్య ఒప్పందం గురించి భారత్ తీవ్రంగా కసరత్తు చేస్తోంది. వచ్చే నెలలో భారత్‌తో ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ పూర్తవుతుందని ఈయూ ట్రేడ్ కమిషనర్ మరోస్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఎయిర్‌పోర్టుల పై అదానీ గ్రూప్ లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులు

న్యూ డిల్లీ డిసెంబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );గౌతమ్ అదానీ నేతృత్వంలోని అదానీ గ్రూప్ రాగల ఐదేళ్లలో ఎయిర్‌పోర్టుల పై లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టాలని యోచిస్తోంది. ఏవియేషన్ సెక్టార్ ఏటా 15 నుంచి 16 శాతం వృద్ధి నమోదు చేయనుందన్న అంచనాల నేపథ్యంలో అదానీ గ్రూప్ ఎయిర్‌పోర్టులపై భారీ పెట్టుబడులకు ప్లాన్ చేసింది. ఈ విషయాన్ని గౌతమ్ అదానీ చిన్న కుమారుడు, అదానీ ఎయిర్‌పోర్ట్స్ డైరెక్టర్ జీత్ అదానీ వెల్లడించారు.అదానీ గ్రూప్ ఈ నెల 25న నవీ ముంబై ఎయిర్‌పోర్టులో కమర్షియల్ ఆపరేషన్స్ ప్రారంభించనుంది. ఈ నేపథ్యంలో ఎయిర్‌పోర్టుల్లో లక్ష కోట్ల పెట్టుబడులు పెట్టబోతున్నామని అదానీ గ్రూప్ ప్రకటించింది. అదానీ గ్రూప్ ఎక్స్‌పాండింగ్ పోర్ట్‌ఫోలియోలో నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయం కొత్తగా చేరుతోంది. ఈ ఎయిర్‌పోర్టును నవీ ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు లిమిటెడ్ అభివృద్ధి చేసింది. లో అదానీ గ్రూప్‌కు 74 శాతం వాటా ఉంది. ఈ ఎయిర్‌పోర్టును ప్రాథమికంగా రూ.19,650 కోట్ల వ్యయంతో, ఏడాదికి రెండు ప్రయాణికుల కెపాసిటీతో నిర్మించారు. తర్వాత దీన్ని ఏడాదికి 9 కోట్ల మంది ప్రయాణికుల కెపాసిటీకి విస్తరించనున్నారు.




# అసమానతల అంతానికి మానవ సంఘీభావమే ఆయుధం !

## (20 డిసెంబర్ "అంతర్జాతీయ మానవ సంఘీభావ దినం" సందర్భంగా)

ప్రపంచ మానవాళి పలు సమస్యల సంక్షోభాల్లో కూరుకుపోతున్నది. పేదరికం కోరలు చాస్తున్నది. అసమానతలు రాజ్యమేలుతున్నాయి. వివక్షలు ఒళ్లు విరుస్తున్నాయి. అనారోగ్యాలు ఆగం చేస్తున్నాయి. ఆకలి కేకలు ప్రాణాలు తీస్తున్నాయి. యుద్ధాలు మారణహోమాలా సృష్టిస్తున్నాయి. కన్నీటి వరదలు పారుతున్నాయి. అంతర్గత సంక్షోభాలు అంతుచూస్తున్నాయి. సామాజిక న్యాయం సత్తుబడుతున్నది. ఆహార అభద్రత నరకం చూపిస్తున్నది. సమస్యలు ప్రపంచ మానవాళిని తరుముతున్నాయి. కుల మత విభేదాల కాళ్లు కంపుకొడుతున్నది. మానవత్వం మంటగలుస్తున్నది.

### అంతర్జాతీయ మానవ సంఘీభావ దినోత్సవం:

ప్రపంచవ్యాప్త 8.2 బిలియన్ల ప్రజలు పలు సమస్యలతో సతమతం అవుతున్న వేళ మానవీయ కోణాన్ని తట్టి లేపుతూ, అభాగ్యుల శ్రేయస్సుకు సంఘీభావం తెలుపవలసిన సందర్భం వచ్చిందని గుర్తు చేయడానికి ప్రతి ఏట 20 డిసెంబర్ రోజుల ప్రపంచ దేశాలు "అంతర్జాతీయ మానవ సంఘీభావ దినం (ఇంటర్నేషనల్ హూమన్ సాలిడారిటీ డే)" పాటించుట 2005 నుంచి ఆనవాయితీగా మారింది. 2025 అంతర్జాతీయ మానవ సంఘీభావ దినోత్సవం ఇతివృత్తంగా "సుస్థిరాభివృద్ధికి సంఘీభావం: మానవాళి ఉజ్వల భవిష్యత్తుకు పౌర సమాజ ఏకీకరణ" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహించడం జరుగుతోంది. ప్రపంచమే ఓ అద్భుత వైవిధ్యత నెలవు. సంస్కృతి వారసత్వాలకు అదో ఆదరువు. ప్రపంచ దేశాలు, ప్రాంతాలు విలక్షణ జీవన విధానాలతో కొనసాగుతున్నాయి. మానవ సమాజం మానవీయతను ప్రదర్శిస్తూ పేదల పాలిట దైవాలుగా నిలిచి, ఆకలిని అంతం చేయడానికి తమ సహాయ సంఘీభావాలను తెలియజేయాల్సిన సమయం ఆసన్నమైనదని ఐరాస భావిస్తున్నది.

### భిన్నత్వంలో ఏకత్వ సాధన :

అంతర్జాతీయమానవ సంఘీభావ దినం వేదికగా భిన్నత్వ ప్రపంచాన్ని ఏకత్వ భావనతో చూడడం, ప్రభుత్వాలు మానవ సమస్యల పరిష్కారాలకు తగు చర్యలు తీసుకోవడం, మానవ ఏకీకరణ ప్రాధాన్యాలను అవగాహన పర్చడం, ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు సంఘీభావ ప్రదర్శనలు చేయడం, పేదరిక నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయడం, సామాజిక న్యాయాలను కల్పించడం లాంటి అంశాలను చర్చించడం జరుగుతుంది. పరమత సహనం, పరహిత సద్గుణాలు నేటి తక్షణ అవసరం అని ప్రచారం చేయాల్సిన శుభ సందర్భం. దయ, కరుణ భావాలను పెంచి పోషించడం, విశ్వ మానవ ఐక్యతకు సంఘీభావాన్ని ప్రకటించడం కొనసాగాలి. విభేదాలు తాత్కాలికమైనవని, చర్చలతో సమస్యలకు పరిష్కారాలు దొరుకుతాయని, ప్రపంచ శాంతి శాశ్వతమని, ప్రజా శ్రేయస్సే మన నినాదం కావాలని కోరుకుంటేనే రేపటి తరం సుఖశాంతులతో మనగలుగుతుందని తెలుసుకొని మానవత్వ పంట పండించడానికి సహాయ, సలహా, సంఘీభావాలను తెలియజేద్దాం. ప్రపంచ మానవ ఏకీకరణకు సంఘీభావ విత్తులు నాటుదాం.

– ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# 'విజన్ 2040' కింద ఒమన్ సాధించిన ఆర్థిక వైవిధ్యీకరణ, సుస్థిర అభివృద్ధిని ప్రశంసించిన భారత్

న్యూఢిల్లీ, డిసెంబర్ 19: ఒమన్ సుల్తాన్ హైతం బిన్ తారిక్ ఆహ్వానం మేరకు, భారత ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2025 డిసెంబర్ 17,18 తేదీల్లో ఒమన్‌లో అధికారికంగా పర్యటించారు. విమానాశ్రయంలో ప్రధానమంత్రికి ఒమన్ ఉప ప్రధానమంత్రి (రక్షణ వ్యవహారాలు) సయ్యద్ షిహాబ్ బిన్ తారిక్ అధికార లాంఛనాలతో స్వాగతం పలికారు. డిసెంబర్ 18, 2025న అల్ బరాకా ప్యాలెస్‌లో సుల్తాన్ హైతం బిన్ తారిక్ ప్రధానికి స్వాగతం పలికారు.

రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలకు ఈ ఏడాది 70 ఏళ్లు పూర్తి అయిన సందర్భంలో ప్రధానమంత్రి ఒమన్ పర్యటనకు విశేష ప్రాధాన్యత ఏర్పడింది. ఇంతకుముందు 2023 డిసెంబర్‌లో ఒమన్ సుల్తాన్ హైతం బిన్ తారిక్ భారతదేశంలో పర్యటించారు.

ఈ సందర్భంగా, సుల్తాన్ హైతం బిన్ తారిక్, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ వివిధ అంశాలపై చర్చలు జరిపారు. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, భద్రత, సాంకేతికత, విద్య, ఇంధనం, అంతరిక్షం, వ్యవసాయం, సంస్కృతి, ప్రజల మధ్య సంబంధాలు సహా అన్ని రంగాలలో ద్వైపాక్షిక సంబంధాలు అత్యుత్తమంగా ఉండటం పట్ల వారు సంతృప్తి వ్యక్తం చేశారు. 2023 డిసెంబర్‌లో ఒమన్ సుల్తాన్ భారత పర్యటన సందర్భంగా ఆమోదించిన ఉమ్మడి దార్శనిక పత్రంలో పేర్కొన్న రంగాలలో కొనసాగుతున్న కార్యక్రమాలు, సహకారాన్ని ఇరువురు నాయకులు సమీక్షించారు. సముద్ర పొరుగు దేశాలు అయిన భారత్, ఒమన్ మధ్య సంబంధం కాల పరీక్షకు నిలబడిందని, ఇది బహుముఖ వ్యూహాత్మక భాగస్వామ్యంగా మారిందని ఇద్దరు నాయకులు గుర్తించారు.

'విజన్ 2040' కింద ఒమన్ సాధించిన ఆర్థిక వైవిధ్యీకరణ, సుస్థిర అభివృద్ధిని భారత్ ప్రశంసించింది. భారత్ సాధిస్తున్న సుస్థిర ఆర్థిక వృద్ధిని, 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారాలనే వికసిత భారత్ లక్ష్యాన్ని ఒమన్ కొనియాడింది. ఇరు దేశాల దార్శనికతలలో ఉన్న సారూప్యాన్ని నాయకులు గుర్తించారు. పరస్పర ప్రయోజన దాయక రంగాలలో కలిసి పని చేయాలని అంగీకరించారు.

వాణిజ్యం, వ్యాపారం ద్వైపాక్షిక సహకారంలో బలమైన స్తంభాలుగా ఉన్నాయని ఇరు దేశాలు గుర్తించాయి. ద్వైపాక్షిక వాణిజ్యంలో మరింత వృద్ధికి, కొత్త రంగాల కు విస్తరించడానికి ఉన్న అవకాశాలను చర్చించారు. వస్త్రాలు, ఆటోమొబైల్స్, రసాయనాలు, పరికరాలు, ఎరువులు వంటి రంగాలలో వాణిజ్యాన్ని ప్రోత్సహించడానికి అపారమైన సామర్థ్యం ఉందని ఇరు దేశాలు అంగీకరించాయి.

భారత్–ఒమన్ సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (సీఈపీఏ)పై సంతకాలను ఇరుపక్షాలు స్వాగతించాయి. ఇది ద్వైపాక్షిక ఆర్థిక సంబంధాలలో ఒక ముఖ్యమైన మైలురాయి. సీఈపీఏ ఇరు దేశాలకు పరస్పరం ప్రయోజనకరం అవుతుందని నాయకులు అంగీకరించారు. ఈ ఒప్పందం ద్వారా ప్రయోజనం పొందాలని ఇరు దేశాల ప్రైవేట్ రంగాలకు సూచించారు.

సీఈపీఏ వాణిజ్యపరమైన అడ్డంకులను తగ్గించడం ద్వారా, సుస్థిరమైన యంత్రాంగాన్ని సృష్టించడం ద్వారా ఇరు దేశాల మధ్య వాణిజ్యాన్ని పెంచుతుందని ఇద్దరు నాయకులు అంగీకరించారు. సీఈపీఏ ఆర్థిక వ్యవస్థలోని అన్ని ప్రధాన రంగాలలో విస్తృతమైన అవకాశాలను సృష్టిస్తుందని, ఆర్థిక వృద్ధికి దోహదపడుతుందని ఉద్యోగాలను సృష్టిస్తుందని, ఇరు దేశాల మధ్య పెట్టుబడులను పెంచుతుందని కూడా వారు పేర్కొన్నారు.

భారత్ ను అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న వర్ధమాన ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా, ఆర్థిక వైవిధ్యీకరణలో ఒమన్ సాధిస్తున్న పురోగతిని గుర్తించిన నాయకులు, మౌలిక సదుపాయాలు, సాంకేతికత, తయారీ, ఆహార భద్రత, రవాణా, ఆతిథ్యం వంటి పరస్పర ప్రయోజనం ఉన్న ప్రాధాన్యత రంగాలలో పెట్టుబడి అవకాశాలను అన్వేషించడానికి ఆసక్తిని వ్యక్తం చేశారు. ఒమన్–ఇండియా జాయింట్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ (ఓఐజేఐఎఫ్) గతంలో సాధించిన విజయవంతమైన రికార్డును దృష్టిలో ఉంచుకుని, ఇది పెట్టుబడులను ప్రోత్సహించడానికి, సులభతరం చేయడానికి బలమైన సామర్థ్యాన్ని కలిగి ఉందని ఇరు దేశాలు గుర్తించాయి.

స్థానిక కరెన్సీలలో ద్వైపాక్షిక వాణిజ్యాన్ని సులభతరం చేయడానికి యంత్రాంగాలను అన్వేషించడంపై ఇరువురు నాయకులు చర్చించారు. ద్వైపాక్షిక పెట్టుబడి ఒప్పందంలో కొనసాగుతున్న పురోగతిని వారు స్వాగతించారు. ఆర్థిక సహకారానికి, పెట్టుబడిదారులకు స్నేహపూర్వక వాతావరణాన్ని నెలకొల్పడానికి ఈ ఒప్పందం సామర్థ్యాన్ని కలిగి ఉందని వారు గుర్తించారు.

ఇంధన రంగంలో ద్వైపాక్షిక భాగస్వామ్యాన్ని పెంపొందించే మార్గాలపై ఇరుపక్షాలు చర్చించాయి. ద్వైపాక్షిక ఇంధన వాణిజ్యం పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ, దీన్ని మరింత పెంచే విస్తృత అవకాశాలు ఉన్నాయని అంగీకరించారు. గ్రీన్ అమ్మోనియా, గ్రీన్ హైడ్రోజన్ రంగాలలో కొత్త పునరుత్పాదక ఇంధన సహకారంతో సహా, భారతదేశంలో అలాగే ప్రపంచ స్థాయిలో అన్వేషణ, ఉత్పత్తి (ఎక్స్ ప్లోరేషన్ అండ్ ప్రొడక్షన్) రంగాలలో సహకారం పెంచేందుకు తమ కంపెనీలకు మద్దతు ఇవ్వడానికి ఇరుపక్షాలు ఆసక్తి వ్యక్తం చేశాయి. సుస్థిర ఇంధన లక్ష్యాలతో ఉన్న సమన్వయాన్ని ఇరుపక్షాలు అంగీకరించాయి. ఉమ్మడి పెట్టుబడులు, సాంకేతికత బదిలీ, దీర్ఘకాలిక భాగస్వామ్యాలను వారు ప్రతిపాదించారు.

రక్షణ రంగంలో పెరుగుతున్న సహకారాన్ని ఇరుపక్షాలు ప్రశంసించాయి. ఉమ్మడి లక్ష్యాలను సాధించడానికి, ప్రాంతీయ భద్రత, సుస్థిరత కోసం ఉమ్మడి విన్యాసాలు, శిక్షణ, ఉన్నత–స్థాయి సందర్శనలు సహా ఈ విషయంలో కలిసి పనిచేయడం కొనసాగించాలని వారు అంగీకరించారు. సముద్ర రంగం పై అవగాహనను పెంపొందించడం ద్వారా, నిరంతర సమాచార మార్పిడిని సులభతరం చేయడం ద్వారా సముద్ర సంబంధ నేరాలను, చౌర్యాన్ని నిరోధించడానికి ఉమ్మడి కార్యక్రమాలను చేపట్టాలని కూడా వారు అంగీకరించారు.

ఈ పర్యటన సందర్భంగా, సముద్ర సహకారంపై ఉమ్మడి దార్శనిక పత్రాన్ని ఇరు దేశాలు ఆమోదించాయి. ఇది ప్రాంతీయ సముద్ర భద్రత, మత్స్య సంబంధ ఆర్థిక వ్యవస్థ, సముద్ర వనరుల సుస్థిర వినియోగం పట్ల రెండు దేశాల ఉమ్మడి నిబద్ధతను ప్రతిబింబిస్తుంది.

ఆరోగ్య రంగంలో సహకారాన్ని తమ భాగస్వామ్యంలోని ముఖ్యమైన స్తంభాలలో ఒకటిగా ఇరుపక్షాలు అంగీకరించాయి. ఈ రంగంలో సహకారాన్ని మరింత బలోపేతం చేయడానికి ఆసక్తిని వ్యక్తం చేశాయి.

నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో ఆయుష్ విభాగాన్ని ఏర్పాటు చేయడం, సాంప్రదాయ వైద్య రంగంలో సహకారాన్ని సులభతరం చేయడానికి ఒమన్‌లో సమాచార విభాగం ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనతో సహా కొనసాగుతున్న చర్చలు, కార్యక్రమాలను ఇరుపక్షాలు గుర్తించాయి.

వ్యవసాయ రంగంలో సహకారానికి ఇరు దేశాలు నిబద్ధతను పునరుద్ఘాటించాయి. వ్యవసాయ శాస్త్రం, పశు సంపద, ఆక్వాకల్చర్ (మత్స్య సంపద) రంగాలలో సహకారాన్ని ముందుకు తీసుకెళ్లడానికి వ్యవసాయం, అనుబంధ రంగాలలో అవగాహన ఒప్పందంపై సంతకాలు చేయడాన్ని నాయకులు స్వాగతించారు. శిక్షణ, విజ్ఞాన మార్పిడి ద్వారా చిరుధాన్యాల సాగులో సహకారాన్ని పెంచడానికి కూడా ఇరుపక్షాలు అంగీకరించాయి.

ఐటీ సేవలు, డిజిటల్ మౌలిక సదుపాయాలు, అంతరిక్ష అనువర్తనాలు వంటి సాంకేతికత రంగాలలో రెండు దేశాల మధ్య పెరుగుతున్న సహకారాన్ని కూడా వారు గుర్తించారు.

సాంస్కృతిక సహకారం బలోపేతం కావడం పట్ల, ప్రజల మధ్య ప్రగాఢమైన సంబంధాల పట్ల ఇరుపక్షాలు సంతృప్తి వ్యక్తం చేశాయి. "లెగసీ ఆఫ్ ఇండో–ఒమన్ రిలేషన్స్" ఉమ్మడి ప్రదర్శనను వారు స్వాగతించారు. సాంస్కృతిక డిజిటలైజేషన్ కార్యక్రమాలపై కొనసాగుతున్న చర్చలను కూడా గుర్తించారు. సోహార్ విశ్వవిద్యాలయంలో ఐసీసీఆర్ ఛైర్ ప్రోగ్రామ్ ఆఫ్ ఇండియన్ స్టడీస్ ఏర్పాటుకు సహకరించాలనే కార్యక్రమాన్ని కూడా ఇరుపక్షాలు గుర్తించాయి. ఇది ఇరు దేశాల మధ్య సాంస్కృతిక, విద్యా సంబంధాల మార్పిడిని ప్రోత్సహిస్తుంది.

సముద్ర వారసత్వం, మ్యూజియాలపై కుదిరిన అవగాహన ఒప్పందాన్ని ఇరుపక్షాలు స్వాగతించాయి. ఇది ఉమ్మడి ప్రదర్శనలు, పరిశోధనల ద్వారా మ్యూజియాల మధ్య సహకారానికి వీలు కల్పిస్తుంది. అలాగే, తమ ఉమ్మడి సముద్ర సంప్రదాయాలను చాటుతూ ఐఎన్ఎస్‌వి కౌండిన్య ఒమన్‌కు జరపనున్న మొట్టమొదటి ప్రయాణాన్ని కూడా వారు గుర్తించారు.

త్వరలో జరిగే ఇండి యా–ఒమన్ వైజ్ఞానిక చర్చలతో సహా విద్య, విజ్ఞాన మార్పిడిలో ప్రస్తుత సహకారాన్ని ఇరుపక్షాలు గుర్తించాయి. ఉన్నత విద్యపై కుదిరిన అవగాహన ఒప్పందం అధ్యాపకులు, విద్యార్థుల మార్పిడి సంస్థాగత సహకారం, ఉమ్మడి పరిశోధనలను ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. భారత సాంకేతిక, ఆర్థిక సహకారం (ఐటెక్) కార్యక్రమం కింద కొనసాగుతున్న సామర్థ్య పెంపు కార్యక్రమాలను కూడా ఇరుపక్షాలు గుర్తించాయి.

గమ్యస్థానాల సంఖ్య, కోడ్–షేరింగ్ నిబంధనలతో సహా విమాన సేవల ట్రాఫిక్ హక్కులపై చర్చించడానికి ఒమన్ చేసిన ప్రతిపాదనకు భారత్ సానుకూలత వ్యక్తం చేసింది.

ప్రజల మధ్య శతాబ్దాల నాటి సంబంధాలు ఒమన్–భారత్ సంబంధాలకు మూలస్తంభాలుగా ఉన్నాయని ఇరుపక్షాలు అంగీకరించాయి. ఒమన్‌లో నివసిస్తున్న సుమారు 6,75,000 మంది క్రియాశీల భారతీయ సమాజం సంక్షేమం, శ్రేయస్సు కోసం కృషి చేస్తున్నందుకు ఒమన్ నాయకత్వానికి భారత్ ధన్యవాదాలు తెలియజేసింది. ఒమన్ అభివృద్ధిలో భారతీయ సంతతి పాత్రను గుర్తించినట్టు ఒమన్ తెలిపింది. పరస్పర ఆసక్తి ఉన్న ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై ఇరుపక్షాలు తమ అభిప్రాయాలను పంచుకున్నాయి. ఉగ్రవాదాన్ని దాని అన్ని రూపాలలో, వ్యక్తీకరణలలో ఇరువురు నాయకులు ఖండించారు.

ఆహ్వానం
శ్రీ మానస ఆర్ట్ థియేటర్స్
ప్రముఖ రచయిత, శ్రీ గణపతి సచ్చిదానంద ప్రశస్తి గ్రహీత
డా॥ వేదాన్తం ఆంజనేయ కుమారస్వామి గారు
రచించిన
"శ్రీవేంకటేశ్వర స్తోత్రమంజరి"
తెలుగు భావానువాద గ్రంధావిష్కరణ మహోత్సవం
స్తోత్ర సంకలన కర్త :
శ్రీ బండారుపల్లి రామచంద్రరావు గారు
మరియు
రఘుశ్రీ హైకూలు - గ్రంధావిష్కరణ
తేది : 22-12-2025 సోమవారం ఉ॥ 10-30 గం॥లకు
వేదిక : కె.వి.రమణాచారి గారి కార్యాలయం, నఫీజ్‌మంజిల్, మాసబ్‌ట్యాంక్, హైదరాబాదు.
ముఖ్య అతిథి, ఆవిష్కర్త : డా॥ కె.వి.రమణ, ఐ.ఏ.ఎస్. (విశ్రాంత) పూర్వ సలహాదారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం
సభాధ్యక్షులు : డా॥ లలితవాణి, ప్రముఖ విద్యావేత్త
విశిష్ట అతిథి : శ్రీ జగన్మోహనరావు, ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త టి.టి.డి. బాలాజీ భవన్, లిబర్టీ రోడ్, హైదరాబాదు
అందరూ ఆహ్వానితులే
కోకా భవాని, కన్వీనర్, మానస ఆర్ట్ థియేటర్స్
రఘుశ్రీ, వ్యవస్థాపక కార్యదర్శి, మానస ఆర్ట్ థియేటర్స్

# శాంతి బిల్లుకు పార్లమెంటు ఆమోదం.. ప్రధానమంత్రి హర్షం

న్యూఢిల్లీ, డిసెంబర్ 19: శాంతి బిల్లుకు పార్లమెంటు ఉభయ సభల్లో ఆమోదం లభించినందుకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. భారత్ సాంకేతిక విజ్ఞాన రంగ రూపురేఖలను మార్చివేసే సందర్భమిది అని ఆయన వ్యాఖ్యానించారు.

బిల్లును సమర్థించినందుకు పార్లమెంటు సభ్యులకు ప్రధాన మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఈ బిల్లు కృత్రిమ మేధకు సురక్షిత శక్తిని అందిస్తుందనీ, తయారీ రంగంలో హరిత ప్రధాన ప్రక్రియలను ఆచరించడానికి బాట వేస్తుందనీ, రాబోయే కాలంలో మన దేశంతో పాటు ప్రపంచంలో స్వచ్ఛ ఇంధనానికి పెద్ద పీట వేయడంలో మహత్తర పాత్రను పోషిస్తుందనీ ప్రధాన మంత్రి అన్నారు.

ప్రయివేటు రంగానికీ, యువతకీ శాంతి బిల్లు అనేక అవకాశాల్ని అందిస్తుందని శ్రీ మోదీ తెలిపారు. భారత్‌లో పెట్టుబడి పెట్టడానికీ, నవకల్పనల మార్గంలో ముందుకు పోవడానికీ, నిర్మాణాలు చేపట్టడానికీ ఈ కాలం అత్యంత అనుకూల కాలమని కూడా ఆయన అన్నారు.

సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ప్రధానమంత్రి ఒక సందేశంలో ఇలా పేర్కొన్నారు.

"శాంతి బిల్లుకు పార్లమెంటు ఉభయ సభలు ఆమోదం తెలపడం మన సాంకేతిక విజ్ఞాన రంగ రూపురేఖలను మార్చివేసే సందర్భం. దీని ఆమోదానికి మద్దతిచ్చిన ఎంపీలందరికీ నేను కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈ బిల్లు కృత్రిమ మేధకు సురక్షిత శక్తిని అందించడం మొదలు తయారీ రంగంలో హరిత ప్రధాన హరిత ప్రధాన ప్రక్రియల ఆచరణకు మార్గాన్ని సుగమం చేయడం వరకు.. భవిష్యత్తులో ఒక్క మన దేశమే కాకుండా, ప్రపంచం కూడా స్వచ్ఛ ఇంధనానికి ప్రాధాన్యాన్ని తప్పక ఇచ్చేటట్లుగా గొప్ప ప్రోత్సాహాన్ని ఇస్తుంది. ప్రయివేటు రంగానికీ, మన యువతకూ అనేక అవకాశాల్ని కూడా ఈ బిల్లు అందిస్తుంది. భారత్‌లో పెట్టుబడి పెట్టేందుకూ, నవకల్పనల దిశగా ముందుకు పోయేందుకూ, భారత్‌లో అభివృద్ధి పనులు చేపట్టేందుకూ ఇది అత్యంత అనుకూలమైన సమయం".

# కారు ఢీకొని మహిళ మృతి

అమరావతి, డిసెంబర్ 19: నందిగామ మండల పరిధిలో ఇవాళ రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా వచ్చిన కారు స్కూటీని ఢీకొన్న ఘటనలో ఓ మహిళ అక్కడికక్కడే దుర్మరణం చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేకగూడ గ్రామానికి చెందిన కొంకణి సుమిత్ర (30) ( భర్త లేట్ జంగారెడ్డి) తన స్కూటీపై జహంగీర్ పీర్ దర్గా రోడ్డు మీదుగా వెళ్తుండగా మేకగూడ చౌరస్తాలోని బెల్లం చాయ్ టీ పాయింట్ సమీపం లోకి రాగానే, అటుగా వచ్చిన కారు ఆమె వాహనాన్ని బలంగా ఢీకొట్టింది.

# ఈ నెల 20 న సంగారెడ్డి, నారాయణఖేడ్‌లలో ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ & రిజిస్ట్రేషన్ మేళా

సంగారెడ్డి, డిసెంబర్ 19 (నేటి నిజం ప్రతినిధి) సంగారెడ్డి జిల్లాలోని ఆహార వ్యాపార నిర్వాహకుల (ఫుడ్ బిజినెస్ ఆపరేటర్ల) కొరకుఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ , రిజిస్ట్రేషన్ మేళా డిసెంబర్ 20, 2025 నిర్వహించనున్నట్లు జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ అధికారి అమృత శ్రీ శుక్రవారం నాడొక ప్రకటన లో తెలిపారు.

ఈ మేళా జిల్లాలో సంగారెడ్డి, నారాయణఖేడ్ లలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సంగారెడ్డిలో కలెక్టరేట్ కాంప్లెక్స్ లోని గెజిటెడ్ ఫుడ్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో, నారాయణఖేడ్‌లో శ్రీ వెంకటేశ్వర సినిమా థియేటర్ నందు,ఉదయం 10.00 గంటల నుంచి నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమం తెలంగాణ రాష్ట్ర ఆహార భద్రతా కమిషనర్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆహార వ్యాపార నిర్వాహకులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సులు, రిజిస్ట్రేషన్లు పొందడం లేదా రెన్యువల్ చేసుకోవాలని ఆమె సూచించారు. మరిన్ని వివరాలకు 9908978790, 9985600602 మొబైల్ నంబర్లలో సంప్రదించ

# దోషికి 20ఏళ్ల జైలు శిక్ష

తిరుపతి, డిసెంబర్ 19: తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో ఎనిమిదేళ్ల క్రితం మద్యం మత్తులో భార్యతో గొడవపడి ఆమెను వేధిస్తూ కిరోసిన్ పోసి నిప్పంటించి హత్య చేసిన భర్తకు ఇవాళ 20ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ నెల్లూరు 8వ అదనపు జిల్లా న్యాయస్థానం తీర్పు ఇచ్చినట్టు తిరుపతి జిల్లా పోలీసు శాఖ ప్రకటించింది.

ఆ వివరాల ప్రకారం సూళ్లూరుపేట మండలం , జంగాల గుంట గ్రామంలో 2017 ఫిబ్రవరి 28వ తేదీ రాత్రి సుమారు 10 గంటల సమయంలో పులి మునుస్వామి అనే వ్యక్తి మద్యం మత్తులో తన భార్య పులి మౌనికను మానసికంగా, శారీరకంగా వేధిస్తూ ఆమెపై దాడి చేసి , ఆమెపై కిరోసిన్ పోసి నిప్పంటించాడు. తీవ్ర గాయాలతో నెల్లూరులోని నారాయణ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మార్చి 4వ తేదీన తెల్లవారుజామున ఆమె మృతిచెందింది. ఈ మేరకు నమోదు చేసిన కేసులో జిల్లా పోలీసులు సాక్ష్యాధారాలను పటిష్టంగా సేకరించి, నేరాన్ని కోర్టులో రుజువు చేయడంలో విజయం సాధించారు.

ప్రాసిక్యూషన్ తరపున సమర్పించిన ఆధారాలను పరిశీలించిన 8వ అదనపు జిల్లా న్యాయమూర్తి జస్టిన్ ఎం.సోమశేఖర్ నిందితుడు మునుస్వామిని దోషిగా నిర్ధారిస్తూ 20సంవత్సరాలు కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 2,000ల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్.కే.రఫీ మాలిక్ వాదనలు వినిపించారు. గుడ్ ట్రయల్ మానిటరింగ్ వ్యవస్థ ద్వారా నేరస్థులకు కఠిన శిక్షలు పడేలా కృషి చేస్తున్న తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు దర్యాప్తు, ప్రాసిక్యూషన్, కోర్టు లైజనింగ్ ద్వారా నేరస్థుడికి కఠిన శిక్ష పడేలా చేసిన అప్పటి సీఐలు విజయ్ కృష్ణ, కిషోర్ బాబు, ప్రస్తుత సీఐ మురళీ కృష్ణ, కోర్టు హెడ్ కానిస్టేబుల్ షేక్ ఖాజా హుస్సేన్, కోర్టు లైజన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, నాయుడుపేట డీఎస్పీ శ్రీ చెంచుబాబులను ప్రత్యేకంగా అభినందించారు.

# తిరుమలేశుని కానుకల లెక్కింపులో ఏఐ వినియోగం

## –టిటిడికి హైకోర్టు సూచన



తిరుపతి, డిసెంబర్ 19: తిరుమలేశుని కానుకలను లెక్కించే పరకామణి కేంద్రంలో అత్యాధునిక ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ పరిజ్ఞానాన్ని వినియోగించు కోవడంపై దృష్టిని సారించాలని తిరుమల తిరుపతి దేవస్థానాల (టిటిడి)ని రాష్ట్ర హైకోర్టు శుక్రవారం ఆదేశించింది. తిరుమల పరకామణి చోరీకి సంబంధించి శుక్రవారం హైకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి తిరుమలలో ఏం జరిగినా కోట్లాదిమంది భక్తుల మనోభావాలపై ప్రభావం ఉంటుందనే విషయాన్ని ప్రత్యేకంగా పేర్కొంటూ హుండీ కానుకల లెక్కింపు విధానాన్ని ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్నారు.

హుండీ లో భక్తులు సమర్పించే ప్రతి పైసా లెక్క సరిగా ఉండాలని పేర్కొ న్నారు. అలాగే గత వాయిదా సందర్భంగా తాము చేసిన సూచనల మేరకు పరకామణి నిర్వహణకు సంబంధించి ఏదైనా సూచనలు, సలహాలు ఇస్తారా అని న్యాయమూర్తి టిటిడి న్యాయవాదులను అడిగారు.

తిరుమల హుండీ కానుకల లెక్కింపులో అనుసరించే విధానాలను వివరిస్తూ లెక్కింపులో డబ్బులే కాకుండా హుండీలో వేసే పూలు, వివిధ వస్తువులు, ముడుపుల మూటలు వంటి వాటిని వేరు చేయడానికి నేలపైనే కూర్చుని లెక్కింపు చేస్తారని న్యాయవాదులు తెలియచేసారు. అయితే నాణాలను, నోట్లను విడివిడిగా లెక్కకట్టే అత్యాధునిక యంత్ర సామాగ్రి కూడా అందుబాటులో ఉండే విషయాన్ని ప్రస్తావించిన న్యాయమూర్తి ఏఐ సాంకేతికతను వినియోగించి మానవ రహితంగా హుండీ కానుకలను లెక్కించే విధానాలను అమలు చేసి విషయంపై టి టి డి బోర్డు దృష్టి సారించాలని సూచించారు.

ఇందుకు అవసరమైన తక్షణ ప్రణాళికలకు రూపొందించుకునే అంశాలతో మరో రెండు వారాల్లో నివేదికను సమర్పించాలని కూడా న్యాయమూర్తి టిటిడికి నిర్దేశించారు. శాశ్వత సంస్కరణల్లో భాగంగా కానుకలను వర్గీకరించడం విదేశీ కరెన్సీని గుర్తించడంలో ఏఐ సాంకేతికతని వినియోగించడం, విలువైన లోహాలను వేరు చేసే వ్యవస్థను రూపొందించడం వంటి అంశాలతో ప్లాన్ బి ముసాయిదాను రూపొందించి ఎనిమిది వారాల్లోగా కోర్టుకు సమర్పించాలని కూడా న్యాయమూర్తి టిటిడిని ఆదేశించారు. పరకామణి కేసుకు సంబంధించి నిందితుడు సివి రవికుమార్ ఆస్తుల అమ్మకాలు, రిజిస్ట్రేషన్లు మొదలైన లావాదేవీలకు సంబంధించి సమగ్ర వివరాలను వారంలోగా కోర్టు ముందు ఉంచాలని ఏసీబీని న్యాయమూర్తి ఆదేశించారు. కేసు తదుపరి విచారణను ఈనెల 26వ తేదికి వాయిదా వేశారు.

# పర్యాటకుల క్షేత్రస్థాయి భద్రత బలోపేతం కోసం పర్యాటక పోలీసుల నియామకం

న్యూఢిల్లీ, డిసెంబర్ 19: పర్యాటకుల కోసం క్షేత్రస్థాయి భద్రతా యంత్రాంగాన్ని బలోపేతం చేయడానికి ప్రత్యేక పర్యాటక పోలీసుల నియామకం కోసం కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వాలతో నిరంతరం చర్చిస్తోంది. పర్యాటక మంత్రిత్వ శాఖ కృషి కారణంగా ఇప్పటికే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ, గోవా, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్, మధ్యప్రదేశ్, ఒడిశా, పంజాబ్, రాజస్థాన్, సిక్కిం, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు పర్యాటక పోలీసులను నియమించాయి. ప్రత్యేక పర్యాటక పోలీసుల నియామకం కోసం రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ ఎటువంటి ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీలు, సహాయం అందించలేదు.

పర్యాటక పోలీసుల అవసరాన్ని అర్థం చేసుకోవడానికి, ఆయా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో నియమించిన పర్యాటక పోలీసులకు పర్యాకటకుల అవసరాలను గురించి అవగాహన కల్పించడానికి ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజం, ట్రావెల్ మేనేజ్‌మెంట్ (ఐఐటీటీఎం) ద్వారా పర్యాటక మంత్రిత్వ శాఖ "రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో పర్యాటక పోలీసుల కార్యాచరణ–అత్యుత్తమ పద్ధతుల డాక్యుమెంటేషన్" పేరుతో ఒక అధ్యయనాన్ని నిర్వహించింది. వారికి శిక్షణ ఇవ్వడానికి ఐఐటీటీఎం ఇచ్చిన శిక్షణ మాడ్యూల్‌ను కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖకు పంపారు. దీనిని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు పంపిణీ చేశారు.

సమగ్ర విధాన ప్రణాళిక రూపొందించడం కోసం బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఈ పర్యాటక పోలీస్ పథకంపై ఒక అధ్యయనాన్ని నిర్వహించి, సమగ్ర నివేదికను రూపొందించింది. పర్యాటకులకు సురక్షితమైన వాతావరణం కల్పించడం కోసం అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో యూనిఫాం పర్యాటక పోలీసు విధానం అమలు లక్ష్యంగా కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ... హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ, పీబీపీఆర్–డీల సహకారంతో అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల పోలీసు శాఖ అధిపతులు డీజీలు, ఐజీలతో న్యూఢిల్లీలో పర్యాటక పోలీస్ పథకంపై జాతీయ సమావేశాన్ని నిర్వహించింది.

ఈ సమాచారాన్ని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీ గజేంద్ర సింగ్ షెకావత్ ఈ రోజు రాజ్యసభలో లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు.

# ఆదికవి నన్నయ్య వర్సిటీలో మంత్రి లోకేష్



అమరావతి, డిసెంబర్ 19:ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. యూనివర్సిటీలో రూ.34 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన మూడు భవనాలను లాంఛనగా ప్రారంభించారు. గత కొన్ని సంవత్సరాలుగా ఈ విశ్వవిద్యాలయంలో విద్యార్థులు తరగతి గదుల కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీసీ ఎస్. ప్రసన్నశ్రీ ఆధ్వర్యంలో భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి పూర్తి చేశారు.

ఈ భవనాలకు తెలుగు సంస్కృతి ప్రతిబింబించేలా నదుల పేర్లను పెట్టడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రూ.20.05 కోట్లతో నిర్మించిన ఇంజినీరింగ్ కళాశాల భవనానికి 'గౌతమి' అని, రూ.8.25 కోట్లతో నిర్మించిన పరీక్షల విభాగానికి 'మంజీర' అని, అలాగే రూ.5.50 కోట్లతో సిద్ధం చేసిన స్కూల్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ భవనానికి 'ఇంద్రావతి' అని నామకరణం చేశారు.

ఈ భవనాల ప్రారంభోత్సవం సందర్భంగా మంత్రి శిలాఫలకాలను ఆవిష్కరించి, యూనివర్సిటీ ప్రాంగణంలో కలియతిరిగారు. విద్యా రంగంలో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా సాగుతున్న ఈ పర్యటనతో అటు పురాతన కళాశాలలకు, ఇటు ఆధునిక విశ్వవిద్యాలయాలకు కొత్త జవజీవాలు అందాయి. ఈ కార్యక్రమాల్లో యూనివర్సిటీ అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని మంత్రికి ఘనస్వాగతం పలికారు.

# కారు ఢీకొని మహిళ మృతి

## -మేకగూడ చౌరస్తాలో ఘటన

అమరావతి, డిసెంబర్ 19:నందిగామ మండల పరిధిలో ఇవాళ రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా వచ్చిన కారు స్కూటీని ఢీకొన్న ఘటనలో ఓ మహిళ అక్కడికక్కడే దుర్మరణం చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేకగూడ గ్రామానికి చెందిన కొంకణి సుమిత్ర (30) ( భర్త లేట్ జంగారెడ్డి) తన స్కూటీపై జహంగీర్ పీర్ దర్గా రోడ్డు మీదుగా వెళ్తుండగా మేకగూడ చౌరస్తాలోని బెల్లం చాయ్ టీ పాయింట్ సమీపంలోకి రాగానే, అటుగా వచ్చిన కారు ఆమె వాహనాన్ని బలంగా ఢీకొట్టింది.

ఈ ప్రమాదంలో సుమిత్రకు తీవ్రగాయాలు కావడంతో ఆమె అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయిది. సమాచారం అందుకున్న నందిగామ పోలీస్ ఇన్స్పెక్టర్ పి.ప్రసాద్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# కంప్యూటర్లను సద్వినియోగం చేసుకోవాలి..



ఆదిలాబాద్, డిసెంబర్ 19:ఉట్నూర్ పరిధిలోని ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులకు అందించిన కంప్యూటర్లను సద్వినియోగం చేసుకొని విద్యలో మరింత రాణించాలని ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి యువ రాజ్ మర్మాట్ అన్నారు. ఇవాళ గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాఠశాల విద్యార్థినులకు ఉచిత కంప్యూటర్ల పంపిణీ కార్యక్రమానికి గ్లోబల్ ఫౌండేషన్ రాష్ట్ర సమన్వయకర్త ఎండి.సాబీర్ హుస్సేన్, ఐ టి డి ఏ ఉపసంచాలకులు అంబాజీ యాదవ్ లతో కలిసి హాజరై విద్యార్థులకు ఉచిత కంప్యూటర్లను అందజేశారు.

ఈసందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ గ్లోబల్ ఫౌండేషన్ సంస్థ అధినేత ఎండి. బాబర్ విద్యార్థులకు ఉచితంగా కంప్యూటర్లు అందించడం అభినందనీయమని తెలిపారు. విద్యార్థులు ఈ కంప్యూటర్లను సద్వినియోగం చేసుకుని సబ్జెక్టులపై మరింత అవగాహన పెంచుకోవాలని, వార్షిక ఫలితాలలో ఉత్తమ ఫలితాలు సాధించాలని తెలిపారు. ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తుందని, అన్ని ప్రభుత్వ పాఠశాలలో సకల సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించడంతో పాటు విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ సి ఎం ఓ జగన్, ఏ టి డి ఓ సదానందం, ఉట్నూర్ మండల విద్యాధికారి ఆశన్న, పాఠశాల ప్రిన్సిపల్ మాణిక్ రావు, గ్లోబల్ ఫౌండేషన్ సంస్థ ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డిసెంబరు 8, 14 తేదీల మధ్య కాలంలో మొత్తంమీద 80 శాతం సమయపాలనను సాధించిన భారతీయ రైల్వే

న్యూఢిల్లీ, డిసెంబర్ 19: కార్యకలాపాల్లో సమర్థతను పెంచడంతో పాటు, ప్రయాణికులకు సమయానికి తగ్గ సేవలు అందేటట్లు చూడటంపై భారతీయ రైల్వే నిరంతరంగా దృష్టి సారిస్తోంది. డిసెంబరు 8, 14 తేదీల మధ్య కాలంలో దేశవ్యాప్తంగా రైళ్లు సమయపాలనను పాటించడంలో 80 శాతం ఫలితాల్ని సాధించాయి. ఇది నిర్ధారిత కాలపట్టికలను నిర్వహించడంలో రైల్వే డివిజన్ల పట్టు వీడని కృషిని ప్రతిబింబిస్తోంది. అన్ని డివిజన్లలోకీ, 37 డివిజన్లు 80 శాతానికి మించిన సమయపాలనను సాధించాయి. 22 డివిజన్లు 90 శాతానికి మించిన సమయపాలనను నమోదు చేశాయి. ఈ విషయంలో 10 డివిజన్లు 95 శాతాన్ని దాటాయి.

సమయాన్ని పాటించడంలో ఉన్నత శ్రేణి ఫలితాల్ని కనబరిచిన డివిజన్లలో, పశ్చిమ రైల్వే పరిధిలోని రత్లామ్ స్కోరు 98.5 శాతంగా ఉంది. సదరన్ రైల్వే పరిధిలోని తిరుచిరాపల్లి 97.5 శాతం, ఇదే పరిధిలోని మదురై 96.7 శాతం సమయపాలనను నమోదు చేసి తరువాతి స్థానాల్లో నిలిచాయి.

సామర్థ్యం పెంపొందడంతో రైళ్ల రాకపోకలు సాఫీగా సాగుతున్నాయి. ఇది ప్రయాణికులకే కాకుండా సరకు రవాణా సేవలకు కూడా ప్రయోజనకరంగా ఉంది.

# డీసీఐడీ ద్వారా డిజిటల్, క్షేత్రస్థాయుల్లో సమాచార పరిధిని విస్తరిస్తున్న ఐ అండ్ బీ మంత్రిత్వ శాఖ

న్యూఢిల్లీ, డిసెంబర్ 19:సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ అమలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వ పథకమే డెవలప్మెంట్ కమ్యూనికేషన్ అండ్ ఇన్ఫర్మేషన్ డిస్సెమినేషన్ (డీసీఐడీ).

ఇది ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాలు, చొరవలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు చేరవేసేందుకు దోహదం చేస్తుంది.

మహారాష్ట్ర, జమ్మూ కాశ్మీర్‌తో సహా దేశవ్యాప్తంగా ఉన్న గ్రామీణ, గిరిజన, మారుమూల, నగర ప్రాంతాల్లోని జనాభాకు సమాచారాన్ని చేరవేయడంపై ఈ పథకం దృష్టి సారిస్తుంది.

ఈ పథకాన్ని సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ తన పరిధిలో ఉన్న మీడియా విభాగాలైన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ), ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ), న్యూ మీడియా వింగ్ (ఎన్ఎండబ్ల్యూ) ద్వారా అమలు చేస్తుంది.

స్వచ్ఛ భారత్ మిషన్, ప్రధానమంత్రి ఆవాస యోజన గ్రామీణ, పట్టణ, జల్ జీవన్ మిషన్, ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి తదితర ప్రభుత్వ పథకాల గురించి సమాచారాన్ని ప్రజలకు చేరవేసేందుకు బహిరంగ మల్టీమీడియా ప్రచారాలను సీబీసీ నిర్వహిస్తుంది.

డీసీఐడీ పథకం ద్వారా చేపడుతున్న కార్యకలాపాల వారీగా చేసిన వ్యయం వివరాలు సీబీసీ వెబ్‌సైట్ లో అందుబాటులో ఉన్నాయి.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో డిజిటల్ విధానలోనూ, క్షేత్రస్థాయిలోనూ ప్రజలకు చేరువ అయ్యేందుకు ఆధునికమైన, బహుళ వేదికల్లో కమ్యూనికేషన్ వ్యూహాన్ని అనుసరించి పథకం సామర్థ్యాన్ని ప్రభుత్వం గణనీయంగా పెంపొందించింది.

డిజిటల్ మీడియా రంగంలో యువత, లక్షిత ప్రజలను చేరుకొనేందుకు వివిధ డిజిటల్ వేదికల్లో లక్ష్య ఆధారిత సమాచార ప్రచారాలు చేపడుతున్నారు. వీటిని భారత ప్రభుత్వ డిజిటల్ ప్రకటన విధానం- 2023 ప్రకారం నిర్వహిస్తారు.

# వందే భారత్ రైళ్లలో ప్రాంతీయ వంటకాలు.. ప్రయాణికులకు మరిన్ని అనుభూతులు

న్యూఢిల్లీ, డిసెంబర్ 19:ఐఆర్‌సీటీసీ ద్వారా భారతీయ రైల్వేలు ప్రాంతీయ వంటకాలను వందే భారత్ రైళ్లలో అందజేయడం మొదలుపెట్టింది. ప్రయాణికులు భిన్న సంస్కృతులకు చెందిన ఆహారాన్నీ, ప్రామాణిక స్థానిక రుచుల్ని ఆరగించేందుకు అవకాశాన్ని కల్పిస్తోంది. ఈ చొరవ.. భారతదేశంలోని వైవిధ్యమైన విశిష్ట వంటకాల్ని నేరుగా ప్రయాణికుల చెంతకు చేర్చుతోంది.. వారు కూర్చున్న సీట్లలో నుంచి మరెక్కడికో వెళ్లనక్కరలేకుండానే, హాయిగా ప్రాంతీయ వంటకాల మజాను పొందే సౌలభ్యాన్ని వారికి కల్పిస్తోంది.

మహారాష్ట్రకు చెందిన కంద పోహాతోపాటు ఆంధ్రప్రదేశ్ వంటకమైన దక్షిణ భారతీయ దొండకాయ కారం పొడి ఫ్రైతో పాటు ఆంధ్రా కోడి కూరనూ 20101/20102 నంబర్లతో నాగపూర్, సికిందరాబాద్‌ల మధ్య నడిచే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ప్రయాణించే వారు రుచి చూడవచ్చు. గుజరాతీ ఆహార పదార్థాలైన మేథీ థెప్లాను నంబర్ 20901 ఎంఎంసీటీ–జీఎన్‌సీ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైల్లోనూ, మసాలా లౌకీని 26902 నంబరు ఎస్‌బీఐబీ–వీఆర్ఎల్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైల్లోనూ సరఫరా చేస్తున్నారు. ఒడిశా వంటకం ఆలూ ఫూల్‌కోపీని నంబర్ 22895 హౌరా–పూరీ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైల్లో ఆస్వాదించవచ్చు.

కేరళ సంప్రదాయ భోజనాన్ని కాసర్‌గోడ్, త్రివేంద్రం మధ్య నడుస్తున్న 20633/34 నంబర్ల వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లలోనూ, మంగళూరు, త్రివేంద్రమ్ మధ్య నడిచే 20631/32 నంబర్ల వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలోనూ అందిస్తున్నారు. దీనిలో అన్నం, పచ్చక్క చెరుపయార్ మెళుక్కు పెరటి, కడల కరీ, కేరళ పరాఠా, సాదా పెరుగు, అప్పంతో పాటు పలడ పాయసం కూడా ఉంటుంది. పశ్చిమ బెంగాల్ కోశా పనీర్‌ను నంబర్ 20872 ఆర్‌ఓయూ–హెచ్‌డబ్ల్యూహెచ్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో, ఆలూ పాటోల్ భజాను నంబరు 22895 హెచ్‌డబ్ల్యూహెచ్–పూరీ వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో అందజేస్తున్నారు. బీహార్‌కు చెందిన ప్రత్యేకమైన చంపారణ్ పనీర్‌ను నంబరు 22349 పీఎన్‌బీఈ–ఆర్ఎన్‌సీ వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో, చంపారణ్ చికెన్‌ను 22348 –హెచ్‌డబ్ల్యూహెచ్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో ఆరగించవచ్చు.

అంబల్ కద్దూ, జమ్మూ చనా మసాలాలు సహా డోగ్రీ పద్ధతి వంటకాల్ని 26401?02, 26403?04 నంబర్ల వందే భారత్ రైళ్లలోనూ, టొమాటో చమన్, కేసర్ ఫిర్నీ వంటి కాశ్మీరీ ప్రత్యేక తినుబండారాల్ని 26401/02, 26403/04 నంబర్లతో ఉన్న ఎస్‌వీడీకే–ఎస్‌ఐఎన్ఏ వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లోనూ అందిస్తున్నారు.

నంబరు 22229 సీఎస్ఎంటీ–ఎంఏఓ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైల్లో మహారాష్ట్ర మసాలా ఉప్మా దొరుకుతోంది. నంబరు 22302 ఎన్‌జేపీ–హెచ్‌డబ్ల్యూహెచ్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో పశ్చిమ బెంగాల్ ముర్గీర్ ఝోల్‌ను వడ్డిస్తున్నారు.

భారతీయ రైల్వేలు భారత విశిష్ట పాకశాస్త్ర వైవిధ్యాన్ని అందరికీ పరిచయం చేస్తోంది. సరికొత్త రుచులతో.. రైలు ప్రయాణాన్ని ఆనందించండి.

# వచ్చే నెల రోజుల్లో 650 ట్రిప్పులను కవర్ చేయనున్న 138 ప్రత్యేక రైళ్లు

న్యూఢిల్లీ, డిసెంబర్ 19: 2025–26 క్రిస్మస్, నూతన సంవత్సర నేపథ్యంలో పెరిగే ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని తొమ్మిది జోన్లలో ప్రత్యేక రైళ్లను విస్తృతంగా నడిపేందుకు రైల్వే ప్రణాళిక సిద్ధం చేసింది. 138 ప్రత్యేక రైళ్లను కేటాయించగా, ఇప్పటి వరకూ ఆమోదించిన 650 ట్రిప్పుల్లో 244 ట్రిప్పులను ప్రకటించారు.

పశ్చిమ రైల్వే (డబ్ల్యూఆర్) అత్యధికంగా 26 రైళ్లను, 226 ట్రిప్పులను ఆమోదించగా, 72 ట్రిప్పులను ప్రకటించారు. 118 ఆమోదించిన ట్రిప్పులతో 18 రైళ్లను మధ్య రైల్వే (సీఆర్) నడుపుతోంది. వీటిలో 76 ట్రిప్పులను ప్రకటించారు. దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సీఆర్) 34 ఆమోదిత ట్రిప్పులతో 26 రైళ్లను నడిపేందుకు ప్రణాళిక రచించింది. వీటిలో 26 ట్రిప్పులను ప్రకటించింది. ఆగ్నేయ మధ్య రైల్వే (ఎస్‌ఈసీఆర్) 12 రైళ్లను 82 ఆమోదిత ట్రిప్పులతో నడుపుతోంది. వాటిలో ప్రకటించిన ట్రిప్పులు 24.

నైరుతి రైల్వే (ఎస్‌డబ్ల్యూఆర్) 42 ఆమోదిత ట్రిప్పులతో 20 రైళ్లను నడిపాలని నిర్ణయించింది. 28 ట్రిప్పుల వివరాలను ప్రకటించారు. అలాగే వాయువ్య రైల్వే (ఎన్‌డబ్ల్యూఆర్) 72 ఆమోదిత ట్రిప్పులతో 14 రైళ్లను నడుపుతోంది. వాటిలో 6 ట్రిప్పులు నోటిఫై అయ్యాయి. ఈశాన్య రైల్వే (ఎన్‌ఈఆర్) 6 ఆమోదిత ట్రిప్పులతో రెండు ప్రత్యేక రైళ్లను నడపాలని ప్రతిపాదించింది. వాటిలో దేనినీ నోటిఫై చేయలేదు. ఈశాన్య ఫ్రాంటియర్ రైల్వే (ఎన్ఎఫ్ఆర్) 4 ఆమోదిత ట్రిప్పులతో 2 ట్రైన్లను నడిపనుంది. వాటిలో 4 ట్రిప్పులను ప్రకటించింది.

క్రిస్మస్, నూతన సంవత్సరం 2025–26 కోసం షెడ్యూలు చేసిన రైళ్ల సంక్షిప్త సమాచారం

ముంబయి–గోవా (కొంకణ్) కారిడార్‌లో ముంబయి సీఎస్ఎంటీ/ఎల్‌టీటీ, కర్మాలీ/మడ్గావ్ మధ్య రోజువారీ, వారాంతపు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నారు. ప్రధాన కేంద్రాలను అనుసంధానిస్తూ.. సీటింగ్, స్లీపర్ అవ్షన్లను అందిస్తుంది. అదే విధంగా సాధారణ రైళ్లలో రద్దీని తగ్గించి ప్రయాణికులకు పండగ సీజన్లో సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించేందుకు ముంబయి–నాగపూర్, పుణె–సంగనేర్, మహారాష్ట్రలోని ఇతర మార్గాల్లో నడుపుతున్న ప్రత్యేక సర్వీసులు దోహదపడుతున్నాయి. ఉత్తర, తూర్పు భారత దేశంలో ఢిల్లీ, హౌరా, లక్నో, పరిసర నగరాలను కలిపే రద్దీగా ఉండే కారిడార్లలో దూర ప్రాంత ప్రయాణికుల కోసం లేదా పర్యాటక ప్రాంతాలకు చేరుకునేందుకు ప్రత్యేక రైళు నడుపుతోంది.

ఈ రద్దీ సమయంలో ప్రయాణికులకు ప్రయాణ సౌలభ్యాన్ని అందించేందుకు దక్షిణ, మధ్య ప్రాంతాల్లో హైదరాబాద్, బెంగళూరు, మంగళూరు, ఇతర నగరాలను కలిపే మార్గాల్లో అదనపు సర్వీసులను నడుపుతున్నారు. ట్రైన్ 1151 సీఎస్ఎంటీ–కర్మాలీ, ట్రైన్ 1152 కర్మాలీ–సీఎస్ఎంటీ, ట్రైన్ 1171 ఎల్‌టీటీ–తిరువనంతపురం, ట్రైన్ 1405 పుణె–సంగనేర్, ట్రైన్ 1005 సీఎస్ఎంటీ–నాగపూర్‌తో పాటు ఇతర రైళ్లను పండగ రద్దీని తగ్గించడం కోసం నడుపుతున్నారు. అదనపు సామర్థ్యాన్ని, సౌకర్యాన్ని, సదుపాయాన్ని కల్పించేందుకు ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. అలాగే ఎలాంటి ప్రయాణ ఒత్తిడి లేకుండా క్రిస్మస్, నూతన సంవత్సరం 2026 నిర్వహించుకొనేలా ప్రయాణికులకు సహకరిస్తుంది. అదే సమయంలో వారిని దేశవ్యాప్తంగా ఉన్న బీచులు, నగరాలు, పర్యాటక ప్రాంతాలకు సమర్థంగా చేరవేస్తుంది.

# పరిశ్రమల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి

## –జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



మచిలీపట్నం, డిసెంబర్ 19: జిల్లాలో విరివిగా పరిశ్రమలు నెలకొల్పేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సంయుక్త కలెక్టర్ ఎం.నవీన్, డీఆర్ఓ కె.చంద్రశేఖర రావులతో కలిసి పరిశ్రములు తదితర అంశాల పురోగతిపై నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఏపీఐఐసీ ద్వారా రెండేళ్ల లోపు మల్లవల్లి, వీరపనేని గూడెం పారిశ్రామిక వాడల్లో పరిశ్రమల ఏర్పాటుకు అన్ని అనుమతులు పొంది ఇంకా యూనిట్లను ప్రారంభించని దాదాపు 400 మంది పారిశ్రామికవేత్తల జాబితా తయారుచేసి వారి యూనిట్లు వెంటనే నెలకొల్పేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం ఈ నెల 30వ తేదీన వారితో ఒక సమావేశం నిర్వహించి అందరిని ప్రోత్సహించాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే వాటిని తెలుసుకొని సంబంధిత శాఖల అధికారులకు ముందుగా తెలియజేయాలన్నారు.

అలాగే 2 సంవత్సరాలు దాటినప్పటికీ ఇంకను పరిశ్రములు నెలకొల్పని వారికి ఎందుకు వాటిని రద్దు పరచకూడదో తెలియజేయాలంటూ నోటీసులు జారీ చేయాలన్నారు.

ఏపీఐఐసీ పేరు మీద భూములు ఉంటేనే మ్యుటేషన్ చేయడానికి వీలుంటుందని స్పష్టం చేస్తూ మ్యుటేషన్ జాబితా సిద్ధం చేసి ప్రత్యేక కార్యక్రమం చేపట్టాలన్నారు.

ఇదివరకే మ్యుటేషన్ చేసి కూడా 22 ఏ జాబితాలో ఉంటే అటువంటి భూముల జాబితా సిద్ధం చేసి 22 ఏ జాబితా నుండి తొలగింపుకు చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రతి నియోజకవర్గానికి ఒక ఎస్ఎంఈ పార్క్ ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

జిల్లా పరిశ్రమల కేంద్రం ద్వారా ర్యాంపు పురోగతి సరిగా లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తూ వ్యాపారం పెంచేందుకు సరైన మార్గ నిర్దేశం చేసే కన్సల్టెంట్లను గుర్తించాలన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలైన పీఎంఈజీపి, పీఎం ఎఫ్ ఎంఈ పథకాల అమలులో పురోగతి సరిగా లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.

పిఎం ఎఫ్ఎంఈ పథకం కింద బ్యాంకులలో 39 దరఖాస్తులు ఎటువంటి పురోగతి లేకుండా పెండింగ్లో ఉన్నాయన్నారు. వాటిని వెంటనే పరిష్కరించి రుణాలు మంజూరు చేయాలన్నారు.

కేవలం బ్యాంకు రుణాలు తీసుకొని వ్యాపారం చేయని వారికి సిఫారసు చేయరాదని, నిజంగా వ్యాపారం చేయాలని ఆసక్తి, తపనపడే వారిని గుర్తించి ప్రోత్సహించాలన్నారు.

ఈ సమావేశంలో మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు ఆర్డీఓ లు స్వాతి, జీ.బాలసుబ్రమణ్యం, బిఎన్ హేలా షారోన్, డి ఆర్ డి ఏ, డ్వామా, మెప్మా పిడీలు శివప్రసాద్, హరిహరనాథ్, సాయిబాబు, జడ్పీ డిప్యూటీ సీఎం ఆనంద్ కుమార్, జిల్లా పశు సంవర్ధక అధికారి చిన్న నరసింహులు, డీఐసీ జీఎం ఆర్ వెంకటరావు, ఏపీఐఐసీ జడ్ ఎం బాబ్జి, జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి షాహిద్ బాబు, ఎల్డీఎం రవీంద్రారెడ్డి, మార్కెటింగ్ ఎడి నిత్యానందం, మార్క్ఫెడ్ డి ఎం మురళీకృష్ణ, తదితర అధికారులు పాల్గొన్నారు.

# దేశవ్యాప్తంగా 591 బ్రాడ్‌కాస్టింగ్ స్టేషన్లను నిర్వహిస్తూ.. ప్రసార పరిధిని విస్తరిస్తున్న ఆకాశవాణి

న్యూఢిల్లీ, డిసెంబర్ 19: దేశవ్యాప్తంగా 591 ప్రసార కేంద్రాల ద్వారా ఆకాశవాణి కార్యకలాపాలు నిర్వహిస్తోంది. వీటిలో 230 స్టేషన్లలో సొంతంగా కార్యక్రమాల రూపకల్పనకు, ప్రసారాల కోసం స్టూడియో సౌకర్యం ఉంది.

ఎక్కువ మందికి చేరువ అయ్యేందుకు గాను మిగిలిన 361 స్టేషన్లలో ఇతర ఆకాశవాణి కేంద్రాల కార్యక్రమాలను ప్రసారం చేస్తారు. రాష్ట్రాల వారీగా ప్రసార కేంద్రాల వెబ్‌సైట్లో అందుబాటులో ఉన్నాయి. భిల్వారాలోని 100 వాట్ల ఎఫ్ఎం రిలే స్టేషన్ (28.04.2023న ప్రారంభమైంది) వివిధ భారతి కార్యక్రమాలను ప్రసారం చేస్తుంది.

కార్యక్రమాలను రూపొందించడానికి, ప్రసారం చేయడానికి ఆకాశవాణి ఉదయ్‌పూర్‌లో స్టూడియో సౌకర్యం ఉంది.

వివిధ భారతి సర్వీస్ (ఎఫ్ఎం)పై స్థానిక పరిధిలో కార్యక్రమాలను రూపొందించి, ప్రసారం చేస్తుంది.

ఇతర ఆకాశవాణి కేంద్రాలు రూపొందించిన కార్యక్రమాలను పునఃప్రసారం చేయాలనే లక్ష్యంతో ఆకాశవాణి భిల్వారాతో సహా దేశవ్యాప్తంగా ప్రసారభారతి రిలే స్టేషన్లు ఏర్పాటయ్యాయి.

ఇవి సాంకేతిక, మానవ వనరులను సమర్థంగా ఉపయోగించుకొని, కార్యక్రమ నాణ్యతను కొనసాగిస్తూనే ఎక్కువ మందికి ప్రసారాలు చేరుకొనేలా చేస్తాయి.

లోక్‌సభలో 17-12-25న సమాచార, ప్రసార శాఖ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ ఈ సమాచారాన్ని అందించారు.

# బీఐఎన్ డీ పథకం ద్వారా రూ. 2,539.61 కోట్లతో దూరదర్శన్, ఆకాశవాణి ఆధునీకరణ

న్యూఢిల్లీ, డిసెంబర్ 19: దూరదర్శన్, ఆకాశవాణి కార్యకలాపాలను మరింత మెరుగుపరచడానికి, పోటీ ప్రపంచంలో వాటి ప్రసారాలను ఎక్కువ సంఖ్యలో ప్రేక్షకులకు అందించేందుకు భారత ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది.

కార్యక్రమాల నాణ్యత, వైవిధ్యాన్ని మెరుగుపరిచేందుకు 2024లో సరళీకృత విధానాన్ని ప్రవేశపెట్టింది. దీని ద్వారా అనేక కొత్త కార్యక్రమాలను వేగంగా అందించడంతోపాటు.. ప్రేక్షకులను ఆకట్టుకునేందుకు వీలవుతుంది.

ప్రాంతీయ, రాష్ట్ర కేంద్రాల ద్వారా స్థానిక కళాకారులను భాగస్వామ్యంతో ప్రాంతీయ భాషల్లో సమాచారాన్ని రూపొం దించడంతోపాటు నిరంతరం కొత్త కార్యక్రమాలను ప్రారంభి స్తుంది.

ప్రతిభను ఆకర్షించి, నాణ్యమైన స్థానిక సమాచారానికి మద్దతందించాలనే లక్ష్యంతో.. దూరదర్శన్‌కు చెందిన 66 కార్యక్రమ నిర్మాణ కేంద్రాల ద్వారా స్థానిక కళాకారులు, తాత్కాలిక ఉద్యోగుల పారితోషికాలను ప్రభుత్వం సవరించింది.

మరింతగా ప్రజల్ని చేరుకునేందుకు ప్రధాన జాతీయ కార్యక్రమాలను ఎప్పటికప్పుడు ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది. దీనికి ఉదాహరణ.. మహాకుంభ మేళా 2025 (ప్రయాగ్‌రాజ్), వేవ్స్ 2025 (ముంబై), ఇస్రో ఉపగ్రహ ప్రయోగాలు.

సాంకేతిక ఆధునీకరణలో భాగంగా అనేక డీడీ ఛానళ్లను హెచ్ డీలో ప్రసారం చేయడంతో పాటు వేవ్స్ ఓటీటీ వేదికను ప్రారంభించడం ద్వారా డిజిటల్ వ్యాప్తిని మరింత బలోపేతం చేసిది.

డీడీతో పాటు ఇతర ఛానళ్లను వేవ్స్ ఓటీటీ ఆన్ లైన్ న్యూస్ ఆన్ ఎయిర్ మొబైల్ యాప్ వంటి డిజిటల్ వేదికలతో సమన్వయం చేశారు.

ఆకాశవాణి కూడా "ది ఆకాశవాణి పాడ్ కాస్ట్", "ఆకాశవాణి ఒరిజినల్స్" అనే ఆడియో విజువల్ పాడ్ కాస్ట్ సిరీస్‌లను ప్రారంభించింది.

ఆకాశవాణిలో ప్రభుత్వం నిర్మాణాత్మక సంస్కరణలను చేపట్టింది.

ఇందులో క్లస్టర్ అధిపతులు, కార్యాలయ అధిపతులకు స్పష్టమైన బాధ్యతలను అప్పజెప్పడం, ఆదాయంపై దృష్టి సారించడం, సమాచార నాణ్యతను మెరుగుపరచడం, మార్కెట్ పరిధిని విస్తరించడం వంటి అంశాలు ఉన్నాయి.

యాప్‌లు, ఓటీటీ, సామాజిక మాధ్యమాలు వంటి ప్రత్యామ్నాయ ప్రసార మాధ్యమాలను విస్తృతంగా వినియోగిస్తుంది. వీటికి అనుబంధంగా బహుళ ఛానళ్ల ద్వారా ప్రచారం, సమన్వయ మార్కెటింగ్ ప్రయత్నాలు కూడా చేపడుతున్నాయి.

ప్రసార భారతి ఆధునీకరణ, మౌలిక సదుపాయాల మెరుగుదల కోసం బ్రాడ్‌కాస్టింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ నెట్‌వర్క్ డెవలప్‌మెంట్ (బీఐఎన్ డీ) పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది.

దీని కోసం రూ. 2,539.61 కోట్లను కేటాయించింది.

ఈ పథకం డిజిటలైజేషన్, పాత వ్యవస్థల స్థానంలో కొత్త వాటి ఏర్పాటు, స్టూడియోలు, ట్రాన్స్‌మిటర్లను అత్యాధునికంగా మార్చడం, ప్రసారాల పరిధిని విస్తరించడం, ఆధునిక సాంకేతిక [illegible] అందిపుచ్చుకోవడంపై దృష్టి సారిస్తుంది.

ఆదాయాన్ని మరింత పెంచేందుకు మెరుగైన వినియోగదారు భాగస్వామ్యం, ఆదాయ పెంపు లక్ష్యంగా సమాచార ప్రణాళిక, బహుళ వేదికల ప్రచార, సమగ్ర ప్రకటనల వ్యూహాలు వంటి చర్యలను కూడా అమలు చేస్తున్నారు.

2022?25 మధ్య కాలంలో ఆకాశవాణి, దూరదర్శన్ ద్వారా ప్రభుత్వేతర ప్రకటనల విభాగం నుంచి మొత్తం రూ. 587.78 కోట్ల ఆదాయం లభించిది.

లోక్ సభలో శ్రీ పర్షోత్తం భాయ్ రూపాలా అడిగిన ప్రశ్నకు సమాధానంగా సమాచార, ప్రసార, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ డిసెంబర్ 17న ఈ వివరాలను వెల్లడించారు.

# బెల్ట్ షాపులను అరికట్టాలి..

## -ట్రాఫిక్ రూల్స్ పాటించాలి
## -డీఎస్పీ ధీరజ్ వినీల్
## -పామర్రు పోలీస్ స్టేషన్ తనిఖీ

అమరావతి, డిసెంబర్ 19: పామర్రు పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ ధీరజ్ వినీల్ శుక్రవారం ఆకస్మికంగా సందర్శిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ తనిఖీలో భాగంగా పామర్రు పోలీస్ స్టేషన్‌ను సందర్శించామని తెలిపారు. క్రైమ్ రేట్ డివిజన్ పరిధిలో అదుపులోకి వచ్చిందని, అన్ని రికార్డులు పరిశీలించామని, పోలీసు బీట్లను పెంచే విధంగా సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. పామర్రు సర్కిల్ పరిధిలో బెల్ట్ షాపులను అరికట్టే దిశగా చూస్తున్నామని డీఎస్పీ స్పష్టం చేశారు. అలాగే హైవేపై బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రత్యేక ప్రమాద సూచికలు పెట్టామని, ప్రజలు ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తగా ప్రయాణం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐ శుభాకర్, ఎస్సైలు రాజేంద్రప్రసాద్, శిరీష, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# యూరియా బుకింగ్ ఇక మొబైల్‌లోనే..

## -రాయపోల్ రైతు వేదికలో అవగాహన



మెదక్,డిసెంబర్ 19: యూరియా కోసం ఇకపై దుకాణాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని, రైతులు ఇంట్లో నుంచే మొబైల్ ద్వారా యూరియా బుక్ చేసుకోవచ్చని గజ్వేల్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు (ఏడీఏ) బాబు నాయక్ తెలిపారు. రాయపోల్ మండలంలోని రైతు వేదికలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్ రైతులకు ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు.

రైతులు తమ ఫోన్‌లో ప్లేస్టోర్ నుంచి ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసి, మొబైల్ నంబర్‌తో లాగిన్ అయి, పట్టాదారు పాస్‌బుక్ నంబర్ నమోదు చేసి, పంట వివరాలు ఎంటర్ చేస్తే తమ పంటకు ఎంత యూరియా అవసరమో ఆ మేరకు సంచులను బుక్ చేసుకోవచ్చని వివరించారు. పంట వివరాలు నమోదు చేసిన తర్వాత మండలాన్ని ఎంచుకుంటే, ఆ మండలంలో ఉన్న ఎరువుల షాపుల పేర్లు, అక్కడ ఎంత యూరియా అందుబాటులో ఉందో కూడా ఫోన్‌లోనే కనిపిస్తుందని తెలిపారు. డిజిటల్ సైన్ లేకుండా పార్ట్?బీలో సాగు చేసే రైతులు, అలాగే కౌలు రైతులు కూడా ఈ యాప్ ద్వారా యూరియా బుక్ చేసుకోవచ్చని ఏడీఏ బాబు నాయక్ స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని ఎరువుల దుకాణాల్లో యూరియా బుకింగ్ సౌకర్యం ఉందన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడాలి.. సీపీఐ జాతీయ నేత చాడ

కరీంనగర్, డిసెంబర్ 19:ప్రజా సమస్యల పరిష్కారం కోసం కమ్యూనిస్టులు మరింత పోరాడాల్సిన అవసరం ఉందని సీపీఐ జాతీయ నేత చాడ వెంకటరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. కాగా ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. ఎన్నికలలో గెలుపు ఓటములు సహజమని, ఓడినంత మాత్రాన కృంగిపోకుండా ప్రజాక్షేత్రంలో ప్రజల కోసం నిరంతరం పనిచేయాలని పిలుపునిచ్చారు.

పంచాయతీ ఎన్నికలు సీపీఐ పార్టీకి నిరాశ కలిగించాయని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజల మధ్య ఉండి ప్రజల ఆదరాభిమానాలు పొందాలన్నారు. పార్టీ నిర్మాణాన్ని మరింత పట్టిష్టపరచుకొని ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. గెలిచిన ఉప సర్పంచ్, వార్డు సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. సీపీఐ వందేళ్ల ఉత్సవాలను పురస్కరించుకొని జిల్లాలో పార్టీని మరింత బలోపితం చేయాల్సిన అవసరం ఉందని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీకి కంచుకోటగా ఉన్న చిగురుమామిడి మండలంలో ఒక్క స్థానం దక్కించుకోకపోవడం బాధాకరమైనప్పటికీ పార్టీని మరింత పట్టిష్టపరిచేందుకు ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేస్తామన్నారు.

ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అందే స్వామి, నియోజకవర్గ కన్వీనర్ జాగీర్ సత్యనారాయణ, మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిని అశోక్, గూడెం లక్ష్మి, జిల్లా కౌన్సిల్ సభ్యులు చాడ శ్రీధర్ రెడ్డి, అందె చిన్నస్వామి, బూడిద సదాశివ, బోయిని పటేల్, తేరాల సత్యనారాయణ, ములుకనూరు ఉప సర్పంచ్ పైడిపల్లి వెంకటేష్, నాయకులు అందె సంపత్, తిరుపతి, విజయ, చొక్కయ్య, సౌందర్య, అనిల్, అన్ని గ్రామాల కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

# డాక్టర్లు లేకుండా ప్రజలకు వైద్యం ఎలా అందిస్తారు.. నిలదీసిన హరీశ్‌రావు



హైదరాబాద్, డిసెంబర్ 19:బస్తీ దవాఖానాల నిర్వహణలో నిర్లక్ష్యంపై మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. సిద్దిపేట పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ వద్ద గల బస్తీ దవాఖానను ఆయన శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా అందులో డాక్టర్ లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడి స్టాఫ్ నర్సును దీనిపై నిలదీశారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో సిద్దిపేటలో నాలుగు చోట్ల బస్తీ దవాఖానలు ఏర్పాటు చేసుకున్నామని హరీశ్‌రావు గుర్తుచేశారు. అందులో ఒక్క కేసీఆర్ నగర్‌లోని బస్తీ దవాఖానలో మినహాయించి మిగతా మూడు బస్తీ దవాఖానలు కాళ్లకుంట కాలనీ, లింగారెడ్డిపల్లి, ఆర్అండ్‌బీ కార్యాలయం సమీపంలో ఉన్న వాటిల్లో గత ఆరు నెలల నుంచి డాక్టర్లు లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవైపు డాక్టర్‌లేక, మెడికల్ ఆఫీసర్ రూమ్ పెచ్చులు ఊడిపోయి, డాక్టర్ కూర్చునే కుర్చీలో దుమ్ముపట్టి ఉండటంపై సీరియస్ అయ్యారు. ఇదేనా బస్తీ దవాఖాన తీరని ప్రశ్నించారు. డాక్టర్లు లేకుండా ప్రజలకు వైద్యం ఎలా అందిస్తారని నిలదీశారు.

పేద ప్రజల కోసం బస్తీ దవాఖానలను ఏర్పాటు చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని సుస్తీ దవాఖానలుగా మార్చిందని హరీశ్‌రావు విమర్శించారు. ఒకవైపు ఆరు నెలలుగా డాక్టర్లు రావడం లేదు.. మరోవైపు ఉన్న అటెండర్‌కు మూడు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని మండిపడ్డారు. బస్తీ దవాఖానాలో ఉన్న స్టాఫ్ నర్స్‌కు నవంబర్ నెల జీతం ఇప్పటికీ రాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ స్టాఫ్ నర్సును దవాఖానలో అందుబాటులో ఉన్న మందుల గురించి అడిగి తెలుసుకున్నారు. మల్టీ విటమిన్, లోప్రెమైడ్, లివో సిట్రిజన్, మెటాఫిన్‌తో పాటు ఉండాల్సిన గ్లిమిఫిరైడ్ 2ఎంజీ లేవని.. చిన్న పిల్లలకు సంబంధించిన జింక్ సల్ఫేట్ కూడా లేవని తెలిసి ఆగ్రహం వ్యక్తం చేశారు. డాక్టర్ వస్తలేడు.. మందులు లేవు.. అలాంటప్పుడు ప్రజలకు వైద్య సేవలు ఎలా అందుతాయని ప్రశ్నించారు. పేద ప్రజలకు అందించే ప్రజా వైద్యం పట్ల నిర్లక్ష్యం వీడాలని సూచించారు. వెంటనే బస్తీ దవాఖానల్లో వైద్యులను ఏర్పాటు చేయాలని, సకాలంలో మందులు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు.

# ఈనెల 23న తిరుమలలో వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు

తిరుపతి, డిసెంబర్ 19: తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో డిసెంబర్ 30 నుంచి జనవరి 8వ తేదీ వరకు వైకుంఠ ద్వార దర్శనాల సందర్భంగా ఈనెల 23న మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తున్నట్లు టీటీడీ అధికారులు వెల్లడించారు.

ఈ సందర్భంగా 23వ తేదీన ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేయడంతో 22వ తేదీ సిఫార్సు లేఖలు స్వీకరించబడవని స్పష్టం చేశారు. సాధారణంగా సంవత్సరంలో నాలుగుసార్లు ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవం, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని వివరించారు.ఇందులో భాగంగా ఉదయం 6 నుంచి 10 గంటల వరకు ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని అర్చకులు ఆగమోక్తంగా నిర్వహిస్తారని, ఈ కారణంగా అష్టదళ పాద పద్మారాధన సేవను రద్దు చేశామన్నారు.

# బెంగళూరులోని ఆచార్య ఇంజనీరింగ్ కళాశాలలో కర్ణాటక తొలి జెన్ జీ తపాలా కార్యాలయం

న్యూఢిల్లీ, డిసెంబర్ 19:కర్ణాటకలో తొలి జెన్ జీ తరం తపాలా కార్యాలయాన్ని భారత తపాలా శాఖ ప్రారంభించింది. బెంగళూరులోని అచార్య ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో అచిత్ నగర్ తపాలా కార్యాలయాన్ని పునరుద్ధరిస్తూ దీనిని ఏర్పాటు చేశారు. యువతకు అనుకూలంగా, సాంకేతికత ఆధారంగా ఏర్పాటు చేసిన ఈ కేంద్రం.. డిజిటల్ సేవలు, సృజనాత్మక రూపకల్పన, ప్రజల అనుసంధానాన్ని మిళితం చేస్తూ నేటితరం యువత అభిరుచులకు అనుగుణంగా రూపుదిద్దుకుంది.

జెన్ జీ తపాలా కార్యాలయం సాంప్రదాయ పోస్టాఫీసు భావనను తొలగిస్తూ.. ఆధునిక సౌకర్యాలతో అహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తోంది. ఇందులో వర్క్ కేఫే, పుస్తకాలు, బోర్డ్ గేమ్‌లతో కూడిన "బుక్-బూత్"తో పాటు బెంగళూరు నగరం, భారత తపాలా శాఖ, ఆచార్య సంస్థ సారాంశాన్ని ప్రతిబింబించేలా ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులు చిత్రించిన కళాకృతులు ఉన్నాయి. ఇందులో ఉచిత వైఫై, సౌకర్యవంతమైన కూర్చునే సదుపాయం, ల్యాప్‌టాప్‌లు, ఫోన్ల కోసం ఛార్జింగ్ పాయింట్లు, కాఫీ తయారీ మెషిన్ వంటి సౌకర్యాలు ఉన్నాయి. విద్యార్థులే లక్ష్యంగా రూపొందించిన ఈ తపాలా కార్యాలయం పని ఉత్పాదకతతో పాటు సామాజిక పరస్పర చర్యలకు అనుకూలమైన వేదికగా నిలుస్తోంది.వినియోగదారులు ఎవరి సహాయం లేకుండానే స్వయంగా సేవలను పొందేందుకు ఇక్కడ కియోస్క్ మిషన్లు అందుబాటులో ఉన్నాయి. డిజిటల్ చెల్లింపుల కోసం క్యూఆర్ కోడ్ ఆధారిత తక్షణ చెల్లింపు సదుపాయం ఉంది. ఇది నేటి తరం యువత ఇష్టపడే డీఐవై పద్ధతికి అనుగుణంగా రూపొందించారు. సందర్శకులు "మై స్టాంప్ కౌంటర్"లో ముద్రించిన వ్యక్తిగత స్టాంపులను కూడా పొందవచ్చు.

ఈ కార్యాలయం బెంగళూరు ఆచార్య టెక్నాలజీ ఇనస్టిట్యూట్ లో 2025 డిసెంబర్ 17న అధికారికంగా ప్రారంభమైంది. కర్ణాటక పోస్టల్ సర్కిల్ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ శ్రీ ప్రకాష్, ఐపీఓఎస్ ముఖ్య అతిథిగా, ఆచార్య సంస్థల డైరెక్టర్ డాక్టర్ శ్రీ భాగీరథి వీ సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక రద్దు ముద్రతో కూడిన ఒక పోస్ట్ కార్డును కూడా విడుదల చేశారు.

జెన్ జీ తరం తపాలా కార్యాలయం గురించి బెంగళూరు పశ్చిమ డివిజన్ పోస్టు శాఖ సీనియర్ అధికారి సూరయ మాట్లాడుతూ.. "ఈ తపాలా కార్యాలయాన్ని అధికారులతోపాటు విద్యార్థుల భాగస్వామ్యంతో రూపొందించారు. దీని రూపకల్పన ఎలా ఉండాలో నిర్ణయించడంలో విద్యార్థులు కీలక పాత్ర పోషించారు. జెన్ జీ తరం విలువలను, సృజనాత్మకతను ఇది ప్రతిబింబిస్తుంది. ఈ కార్యక్రమం 'విద్యార్థుల ద్వారా, విద్యార్థుల కోసం, విద్యార్థుల చేత' అనే నినాదంతో సాగింది. ఈ పోస్టాఫీసు పార్శిల్ ప్యాకేజింగ్ సేవలను కూడా అందిస్తుంది. ఇది విద్యార్థుల సమయాన్ని ఆదా చేయడమే కాకుండా ఒత్తిడిని తగ్గిస్తుంది. తమ వస్తువులను నేరుగా చదువుతున్న ప్రాంతం నుంచి తరలించడం, రవాణా చేయడం సులభమవుతుంది.దేశవ్యాప్తంగా విద్యా సంస్థల్లో ఇలాంటి జెన్ జీ నేపథ్య పోస్టాఫీసులను విస్తరించడానికి భారత తపాలాశాఖ ప్రణాళికలు రూపొందిస్తోంది.

# పచ్చదనం పెంపుపై తిరుమలలో హరిత దీక్షకురాలు నైనిక ప్రచారం



తిరుపతి, డిసెంబర్ 19:లోకనాయకుడి నామస్మరణతో నిత్యం మారుమ్రోగిపోయే తిరుమల కొండల్లో ప్రకృతిని కాపాడండంటూ హరిత దీక్షకురాలు నైనిక చేసిన వినూత్న ప్రచారానికి ప్రశంసల జల్లు కురుస్తోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని సెయింట్ మేరీస్ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న నైనిక రజువా శ్రీనివాసుడి దర్శనార్థం తిరుమలకు చేరుకున్న సందర్భంగా అలిపిరి వద్ద నుంచి మెట్ల మార్గంలో నడుచుకుంటూ కొండపైకి చేరుకుంది. ఈ క్రమంలోనే వీపునకు మొక్కను తగిలించుకుని, ముఖానికి ఆక్సిజన్ మాస్క్ పెట్టుకుని.. నేడు మనం మొక్కలను నాటి వాటిని సంరక్షించకపోతే భవిష్యత్‌లో మనం ఇలా మొక్కలను వీపుకు తగిలించుకునే పరిస్థితి వస్తుందంటూ 3,550 మెట్లు ఎక్కి చేసిన వినూత్న ప్రచారానికి భక్తుల నుండి సానుకూల స్పందన లభించింది.

మెట్ల మార్గంలో అలిపిరి, హనుమాన్ ఆలయం, మోకాళ్ల పర్వతం ప్రాంతాల్లో భక్తులు నైనిక రజువా చేపట్టిన ప్రచార వివరాలను అడిగి తెలుసుకుని నైనిక చేసిన ప్రయత్నాన్ని అభినందించారు. భక్తులకు పచ్చదనం ప్రాధాన్యతను వివరిస్తూ, మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించుకోవడం ఎంత అవసరమో వివరించింది. తిరుమల చేరుకున్న అనంతరం వేంకటేశ్వర స్వామిని దర్శించుకుని పచ్చదనాన్ని పెంపొందించాలనే సంకల్పాన్ని వ్యక్తం చేసింది. తిరుమల ప్రాంగణంలో స్వామివారి సన్నిధిలో మారేడు, సింధూరపు మొక్కలను నాటింది. చిన్న వయస్సులోనే పర్యావరణంపై బాలిక చూపిన ఈ చైతన్యానికి భక్తులు, స్థానికులు ప్రశంసలు కురిపించారు.

# డిజిటల్ అరెస్ట్ పేరుతో భారీ మోసానికి సైబర్ నేరగాళ్ల పన్నాగం

## తక్షణం స్పందించిన నల్లగొండ జిల్లా సైబర్ క్రైమ్ పోలీసులు
## -బాధితుడి నుండి రూ.18 లక్షలు బదిలీ కాకుండా కాపాడిన వైనం
## - సైబర్ నేరగాళ్ల పట్ల జాగ్రత్తగా ఉండాలి
## - సైబర్ క్రైమ్ డీఎస్పీ లక్ష్మీనారాయణ



నల్లగొండ డిసెంబర్ 19 : డిజిటల్ అరెస్ట్ అంటూ బెదిరింపులకు గురిచేస్తూ రూ.18 లక్షలు తమ అకౌంట్‌కి ట్రాన్స్‌ఫర్ చేయాలి, లేదంటే మిమ్మల్ని అరెస్ట్ చేస్తామని భయభ్రాంతులకు గురిచేసిన కేసును నలగొండ జిల్లా సైబర్ క్రైమ్ పోలీసులు వెంటనే స్పందించి బాధితుడి వద్ద నుండి నగదు బదిలీ కాకుండా కాపాడడం జరిగింది. నల్లగొండ పట్టణానికి చెందిన రిటైర్డ్ టీచర్ పుచ్చకాయల దేవేందర్ రెడ్డి పేరుతో సైబర్ నేరగాళ్లు కొత్త సిమ్ తీసుకుని అతనికి ఫోన్ కాల్ చేశారు. బెంగళూరులో అసాంఘిక కార్యకలాపాలు చేస్తున్నట్లు తప్పుడు ఆరోపణలు చేస్తూ అరెస్ట్ చేస్తున్నట్లు బెదిరించారు. అరెస్ట్ కాకుండా ఉండాలంటే తామిచ్చే అకౌంట్ నంబర్‌కు వెంటనే రూ.18 లక్షలు డిపాజిట్ చేయాలని డిమాండ్ చేశారు. వారి బెదిరింపులకు భయపడి బాధితుడు ప్రకాశం బజార్‌లోని ఎస్‌బీఐ బ్యాంక్‌కి వెళ్లి రూ.18 లక్షలు డిపాజిట్ చేయాలని మేనేజర్‌ను కోరాడు.

దీంతో అనుమానం వచ్చిన మేనేజర్ వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. తక్షణమే సైబర్ క్రైమ్ డీఎస్పీ లక్ష్మీనారాయణ, ఎస్ఐ విష్ణుకుమార్, సిబ్బంది అక్కడికి చేరుకుని దేవేందర్ రెడ్డిని విచారించగా జరిగిన సంఘటన తెలపగా అతడికి వచ్చిన ఫోన్ కాల్ లిస్ట్‌ను పరిశీలించి సైబర్ నేరగాళ్లకు తిరిగి కాల్ చేసి ప్రశ్నించగా వారు తడపడుతూ వెంటనే ఫోన్ స్విచ్ ఆఫ్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా సైబర్ క్రైమ్ డీఎస్పీ మాట్లాడుతూ.. డిజిటల్ అరెస్ట్ పేరుతో ప్రభుత్వ సంస్థలు లేదా అధికారులు గాని బెదిరించడం, భయపెట్టడం చేయరన్నారు.

వీడియో కాల్స్ ద్వారా అరెస్టులు చేయరన్న విషయాన్ని అంతా గుర్తుం చుకోవాలన్నారు. అటువంటి కాల్స్ వస్తే నమ్మకుండా వెంటనే www.cybercrime.gov.in నందు లేదా 1930 టోల్ ఫ్రీ నెంబర్ కి ఫోన్ చేసి రిపోర్ట్ చేయాలని సూచించారు. సకాలంలో స్పందించి సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా కాపాడిన నల్లగొండ సైబర్ క్రైమ్ డీఎస్పీ లక్ష్మీనారాయణ, ఎస్ఐ విష్ణు, హెడ్ కానిస్టేబుల్ రియాజ్, కానిస్టేబుల్ మోక్షిద్ లను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అభినందించారు.




# క్యాన్సర్ ముప్పు లేదని రాజ్యసభలో వెల్లడించిన డాక్టర్ జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ, డిసెంబర్ 19: లోక్‌సభలో ఆమోదం పొందిన సస్టెయినబుల్ హార్నెస్సింగ్ అండ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా (శాంతి) బిల్లు-2025పై కేంద్ర సైన్స్, టెక్నాలజీ, భూ శాస్త్రాల శాఖ, పీఎంఓ, సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్లు, అణు శక్తి, అంతరిక్ష శాఖ సహాయమంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ రాజ్యసభలో జరిగిన చర్చలో పాల్గొని, బిల్లులోని కీలక నిబంధనలను స్పష్టం చేస్తూ, సభ్యులు లేవనెత్తిన సందేహాలను నివృత్తి చేశారు. అణు భద్రత, దేశ సార్వభౌమాధికారం, ప్రజా జవాబుదారీతనం విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు.

ఈ బిల్లు, అణు ఇంధన చట్టం-1962, అణు నష్టానికి పౌర బాధ్యత (సీఎల్ఎన్‌డీ) చట్టంలోని నిబంధనలను క్రమబద్ధీకరించి, ఏకీకృతం చేస్తుందని, అణుశక్తి నియంత్రణ బోర్డుకు చట్టబద్ధత కల్పిస్తూ, దాన్ని ప్రధాన చట్టంలో భాగంగా చేర్చినట్లు డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. ఇది నియంత్రణ పర్యవేక్షణను మరింత పటిష్టం చేస్తుందని, అణు నిర్వహణలో అంతర్జాతీయ ఉత్తమ ప్రమాణాల పట్ల భారతదేశం ఇస్తున్న ప్రాధాన్యతను ప్రతిబింబిస్తుందని ఆయన వెల్లడించారు.

మారుతున్న ప్రపంచ, సాంకేతిక పరిస్థితులపై మాట్లాడుతూ, 2010లో అణు ఇంధన సంస్కరణలపై లేవనెత్తిన అభ్యంతరాలను వాస్తవ పరిస్థితుల దృష్ట్యా పునః సమీక్షించాలని డాక్టర్ జితేందర్ సింగ్ అన్నారు. నేడు సాంకేతికత, భద్రతా వ్యవస్థలు, ప్రపంచ ఇంధన అవసరాలు పూర్తిగా మారిపోయాయని తెలిపారు. చిన్న మాడ్యులర్ రియాక్టర్లు, భారత స్మాల్ రియాక్టర్లు పదిహేనేళ్ల కిందట ఊహించని అంశాలనీ, ఇప్పుడివి 24 గంటల పాటు సురక్షితంగా, సమర్థవంతంగా విద్యుత్‌ను అందించే పరిష్కారాలుగా మారుతున్నాయని చెప్పారు.

భద్రతాపరమైన ఆందోళనలను కేంద్రమంత్రి ప్రస్తావిస్తూ, అణు భద్రతా ప్రమాణాల్లో ఎలాంటి మార్పు లేదని, వాటి విషయంలో రాజీ పడబోమని, అణుశక్తి చట్టం-1962లో పొందుపరిచిన "ముందుగా భద్రత, తర్వాతే ఉత్పత్తి" అనే కఠిన సూత్రాల ఆధారంగానే ఉంటాయని వెల్లడించారు. కఠినమైన తనిఖీ విధానాలను వివరిస్తూ, నిర్మాణదశలో త్రైమాసిక తనిఖీలు, నిర్వహణ దశలో ద్వైవార్షిక తనిఖీలు, లైసెన్స్ పునరుద్ధరణకు ఐదేళ్లకొకసారి తనిఖీలు, చట్టబద్ధత పొందిన అణుశక్తి నియంత్రణ మండలికి అదనపు అధికారాలు కల్పించటం, అంతర్జాతీయ అణుశక్తి సంస్థ నిబంధనలకు అనుగుణంగా పర్యవేక్షణ ఉంటుందని చెప్పారు. భూకంప ప్రభావిత ప్రాంతాలకు దూరంగా భారత్‌లో అణు విద్యుత్ కేంద్రాలున్నాయని, భారత రియాక్టర్ల రేడియేషన్ స్థాయిలు అంతర్జాతీయ భద్రతా పరిమితులకన్నా చాలా తక్కువగా ఉన్నట్లు సభకు తెలియజేశారు.

భారత అణు రియాక్టర్ల వల్ల క్యాన్సర్ కారక ప్రభావాలుంటాయనటానికి ఎలాంటి శాస్త్రీయ ఆధారాలు లేవని కేంద్రమంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ స్పష్టం చేశారు. కూడంకుళం, కల్పక్కం, రావత్ భటా, తారాపూర్ అణు విద్యుత్ కేంద్రాల వద్ద రేడియేషన్ ఉద్గారాల గణాంకాలను మైక్రో సీవర్ట్స్‌లో చెబుతూ.. అనుమతించిన పరిమితుల కంటే తక్కువగానే రేడియేషన్ స్థాయిలున్నట్లు వెల్లడించారు. అణురంగంలో సైబర్ భద్రతా ప్రమాణాలను భారత్ గణనీయంగా మెరుగుపరిచిందని, మారుతున్న కాలానికి అనుగుణంగా సైబర్ దాడులను ఎదుర్కోవటానికి ఎన్‌క్రిప్షన్, సురక్షిత కోడింగ్, రెగ్యులర్ ఆడిట్స్, మాల్వేర్ ఫిల్టరింగ్, వివిధ స్థాయిల్లో డిజిటల్ రక్షణ వంటి అత్యాధునిక సాంకేతికతలను అమలు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రైవేటీకరణపై అపోహలను తొలగిస్తూ, అన్వేషణ కార్యకలాపాల్లో నిర్ణీత నిబంధనల మేరకు ప్రైవేట్ భాగస్వాములను అనుమతించినప్పటికీ, నిర్దేశించిన పరిమితులకు మించి జరిగే యురేనియం మైనింగ్ మాత్రం ప్రభుత్వాధీనంలోనే ఉంటుందని కేంద్ర మంత్రి తెలిపారు. వినియోగించే ఇంధన నిర్వహణ ప్రభుత్వ పర్యవేక్షణలోనే ఉంటుందని చెప్పారు. ఇందుకోసం స్పష్టమైన, దీర్ఘకాలిక నిల్వ, నిర్వహణ నిబంధనలను ప్రభుత్వం అనుసరిస్తుందని వెల్లడించారు. కీలకమైన ముడి సామాగ్రి, విచ్ఛిన్నమయ్యే పదార్థాలు, భారజలం వంటివి కచ్చితంగా ప్రభుత్వ నియంత్రణలోనే ఉంటాయని చెప్పారు.

జవాబుదారీతనం, పరిహారం గురించి వివరిస్తూ, చిన్న తరహా పెట్టుబడిదారులను ప్రోత్సహించేలా ఈ బిల్లులో అంచెల వారీగా బాధ్యతా పరిమితులను ప్రవేశపెట్టినట్లు డాక్టర్ జితేంద్ర సింగ్ వివరించారు. బాధితులకు అందే పరిహారంలో ఇది ఎలాంటి కోతలు విధించదని స్పష్టం చేశారు. ఆపరేటర్ బాధ్యతా పరిమితిని దాటి నష్టం జరిగితే, ప్రభుత్వ నిధులు, అంతర్జాతీయ ఒప్పందాల ద్వారా పూర్తి పరిహారం చెల్లించేలా వ్యవస్థను ఏర్పాటు చేశామని, తద్వారా బాధితులకు రక్షణ ఉంటుందని హామీ ఇచ్చారు. అణు నష్టం నిర్వచనాన్ని పర్యావరణ నష్టానికి విస్తరిస్తూ ఈ బిల్లులో చేర్చినట్లు చెప్పారు.

పౌరుల వివాదాలను వేగంగా పరిష్కరించటానికి అటామిక్ ఎనర్జీ రిడ్రెస్సల్ కమిషన్ ను ప్రవేశపెట్టినట్లు కేంద్రమంత్రి వెల్లడించారు. సివిల్ కోర్టులకు, ఉన్నత న్యాయస్థానాలకు వెళ్లే హక్కును ఇది ఏ మాత్రం ప్రభావితం చేయదని చెప్పారు. అణు వ్యవహారాలను న్యాయ సమీక్ష పరిధి నుంచి ఈ బిల్లు తప్పిస్తుందనే వాదనలను ఆయన తోసిపుచ్చారు.

సార్వభౌమాధికారం, విదేశీ ప్రభావంపై వ్యక్తమవుతున్న ఆందోళనలకు సమాధానమిస్తూ, భారత్ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని, సంప్రదాయ బలాలను పణంగా పెట్టకుండా, కేవలం దేశ పరిస్థితులకు సరిపోయే అంతర్జాతీయ అత్యుత్తమ పద్ధతులను మాత్రమే అవలంబిస్తుందని డాక్టర్ జితేంద్ర సింగ్ స్పష్టం చేశారు. శాంతి బిల్లు పౌర అణుశక్తికి మాత్రమే సంబంధించినదని, యురేనియం స్థాయిలను కేవలం రియాక్టర్ అవసరాలకు మాత్రమే పరిమితం చేశామని, అణ్వాయుధ కార్యకలాపాలతో ఎలాంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు.

ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, ఆహార భద్రత, క్యాన్సర్ చికిత్స వంటి రంగాల్లో అణుశాస్త్రం విస్తరిస్తున్న తీరుని డాక్టర్ జితేంద్ర సింగ్ స్పష్టం చేశారు. టాటా మెమోరియల్ సెంటర్ వంటి సంస్థల ద్వారా చిన్నారుల్లో ల్యూకేమియా, ప్రోస్టేట్ క్యాన్సర్ చికిత్సలో అణు వైద్యం సాధించిన పురోగతి గురించి చెప్పారు. పరిశోధనల్లో భాగస్వామ్యాన్ని సులభతరం చేయటం ద్వారా ఆవిష్కరణల వేగం పెరుగుతుందన్నారు.

దీర్ఘకాలిక భారత అణు శక్తి రోడ్ మ్యాప్ గురించి వివరిస్తూ, దేశం ఇప్పటికే 9 జీడబ్ల్యూ అణు సామర్థ్యాన్ని సాధించిందని, 2032 నాటికి 22 జీడబ్ల్యూ, 2037 నాటికి 47 జీడబ్ల్యూ, 2042 నాటికి 67 జీడబ్ల్యూ, 2047 నాటికి 100 జీడబ్ల్యూ చేరటమే భారత్ లక్ష్యమని కేంద్రమంత్రి తెలిపారు. భారత దేశ మొత్తం ఇంధన అవసరాల్లో ఇది దాదాపు 10% తీరుస్తుందని ఆయన చెప్పారు. కృత్రిమ మేధ, డిజిటల్ మౌలిక సదుపాయాల పెరుగుదలతో భవిష్యత్తులో ఏర్పడే విద్యుత్ డిమాండ్ ను తీర్చేందుకు అణుశక్తి అత్యంత కీలకమని స్పష్టం చేశారు. ఇతర పునరుత్పాదక ఇంధన వనరులతో పోల్చితే.. విశ్వసనీయమైన, స్వచ్ఛమైన విద్యుత్‌ను నిరంతరం అణు శక్తి అందిస్తుందని వివరించారు.

డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రసంగాన్ని ముగిస్తూ.. భారత దేశ ఆత్మవిశ్వాసాన్ని, శాస్త్రీయ పరిణతిని, ప్రపంచస్థాయిలో పర్యావరణహిత ఇంధన పరివర్తనకు బాధ్యతాయుతమైన నాయకత్వానికి సంసిద్ధతను శాంతి బిల్లు ప్రతిబింబిస్తుందని అన్నారు. నిర్మాణాత్మకమైన సలహాలను స్వీకరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, నిబంధనల రూపకల్పనకు భాగస్వాములను సంప్రదిస్తుందని, దేశ అణు శక్తి ప్రయాణం నిరంతరం భద్రత, పారదర్శకత, జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగా సాగుతుందని సభ్యులందరికీ హామీ ఇచ్చారు.

## 'పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల భాగస్వామ్యం కావాలి'

**-ఎన్‌జీసీ రాష్ట్ర ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎం.రాజశేఖర్**

నల్గొండ, డిసెంబర్ 19:పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలని నేషనల్ గ్రీన్ కోర్స్ (ఎన్‌జీసీ) ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎం.రాజశేఖర్ అన్నారు. ఎస్సీఈ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న పర్యావరణ కార్యక్రమాల్లో భాగంగా నల్లగొండ జిల్లాలో ఎంపికైన పాఠశాలలలో నిర్వహించే అంశాలను ఆయన శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్పీ రోడ్డులోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను జిల్లా సైన్స్ అధికారి వనం లక్ష్మీపతితో కలిసి సందర్శించారు.

ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులు వ్యర్థ కాగితాలతో తయారు చేసిన పలు అలంకరణ, జీవశాస్త్ర ప్రాజెక్టులను పరిశీలన చేసి విద్యార్థులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి పౌరులు కావునా పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచి భవిష్యత్‌కు బాటలు వేయాలనే లక్ష్యంతోనే కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రతి విద్యార్థి తమ ఇంటి సమీపంలోని వారందరికి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించి చైతన్యం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు పూర్ణిమా పాల్గొన్నారు.

## 21న జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి : డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

నల్గొండ, డిసెంబర్ 19: కోదాడ కోర్టు ఆవరణలో ఈ నెల 21న జరగనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోదాడ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. జాతీయ మెగా లోక్ అదాలత్ ద్వారా త్వరితగతిన, ఇరువైపులా సమ్మతితో సమస్యలను పరిష్కరించుకునే అవకాశం అందుబాటులో ఉందన్నారు. రాజీ చేసుకునే అవకాశమున్న వివిధ రకాల క్రిమినల్, కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తి విభజన కేసులు, వైవాహిక జీవితం, కుటుంబ సమస్యలకు సంబంధించిన కేసులు, డ్రంకన్ డ్రైవ్, మోటారు వాహన చట్టం ఉల్లంఘనలు, చెక్ బౌన్స్ కేసులు, బ్యాంక్ రికవరీ, విద్యుత్ చౌర్యం తదితర కేసులు పరిష్కరించుకోవచ్చని వెల్లడించారు. కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని, డబ్బును వృథా చేసుకోవద్దని సూచించారు. న్యాయశాఖ అందిస్తున్న ఈ అవకాశాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని కోరారు.

## హోటల్‌లో తప్పుడు రూమ్ తట్టిన మహిళ.. ముగ్గురు వ్యక్తులు సామూహిక అత్యాచారం

ముంబై: ఒక మహిళ హోటల్‌కు వెళ్లి ఫ్రెండ్‌ను కలిసింది. ఆ తర్వాత పొరపాటున ఆ హోటల్‌లోని మరో రూమ్ నాక్ చేసింది. అందులో మందు పార్టీ చేసుకున్న ముగ్గురు వ్యక్తులు ఆ మహిళను లోపలకు లాక్కెళ్లారు. ఆమెపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీ నగర్‌లో ఈ సంఘటన జరిగింది. 30 ఏళ్ల మహిళ ప్రైవేట్ ఆసుపత్రిలో పని చేస్తున్నది. గురువారం రాత్రి ఫ్రెండ్ నుంచి డబ్బులు తీసుకునేందుకు హోటల్‌కు వెళ్లింది. రూమ్ నంబర్ 105లో ఉన్న ఫ్రెండ్‌ను కలిసింది.

కాగా, ఫ్రెండ్ రూమ్ నుంచి బయటకు వచ్చిన తర్వాత ఆ మహిళ పొరపాటున హోటల్ రెండో అంతస్తు చేరుకున్నది. గందరగోళంలో ఉన్న ఆమె రూమ్ నంబర్ 205 డోర్ తట్టింది.

# శాస్త్రసాంకేతిక రంగాల్లో దేశం మరింత అభివృద్ధి చెందాలి : ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి




వరంగల్,డిసెంబర్ 19:శాస్త్ర, సాంకేతిక రంగాలలో భారతదేశం మరింత అభివృద్ధి చెందాలని అప్పుడే విశ్వగురువుగా కీర్తించబడుతుందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. హనుమకొండ పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనను శుక్రవారం హనుమకొండలోని సెయింట్ పీటర్స్?ఎడ్యుస్కూల్ ఆవరణలో ఆయన జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి లింగాల వెంకటగిరిరాజ్ గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ దేశాలతో, అభివృద్ధి చెందిన దేశాలతో పోటీ పడాలంటే శాస్త్ర, సాంకేతిక రంగాలలో మరింత పురోభివృద్ధి అవసరమన్నారు.

చైనా వ్యవసాయ రంగంలోకన్నా కూడా పారిశ్రామికరంగ అభివృద్ధితోనే ప్రపంచాన్ని శాసిస్తున్నదని, స్వాతంత్రం వచ్చాక మొదటి ప్రధాని నెహ్రూ తన డిస్కవరీ ఆఫ్ ఇండియాలో భారతదేశం వ్యవసాయ ఆధారితదేశంగా గుర్తింపున్నా శాస్త్ర, సాంకేతిక రంగాలలో అభివృద్ధి చెందితేనే అభివృద్ధి సాధిస్తుందని పేర్కొంటూ ఇంజినీరింగ్ కాలేజీలను, పరిశ్రమలను ఏర్పాటు చేశారన్నారు. విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనకు విద్యార్థులు తీసుకువచ్చే ప్రదర్శనలు సృజనాత్మకతతో కూడిన కొత్త ఆలోచనలతో ఉండాలని అప్పుడే మంచి శాస్త్ర, సాంకేతిక రంగానికి బాటలు వేసిన వారవుతారన్నారు.

ఈ సమావేశంలో ఆర్జేడీ డి.సత్యనారాయణరెడ్డి డీఈవో లింగాల వెంకటగిరిరాజ్ గౌడ్, హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ మేన శ్రీను, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసస్వామి, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు రామకృష్ణ, హనుమకొండ ఎంఈఓ నెహ్రూనాయక్, సెయింట్ పీటర్స్ విద్యాసంస్థలు అధినేత నారాయణరెడ్డి, సెయింట్ పీటర్స్ ఎడ్యు విద్యాసంస్థల ప్రిన్సిపల్ ఎన్.హరిత, ట్రస్మా జిల్లా అధ్యక్షులు మాదాల సతీష్, సీఎంఓ బద్దం సుదర్శన్ రెడ్డి, హసన్‌పర్తి ఎంఈఓ శ్రీనివాసరెడ్డి, కాజీపేట ఎంఈఓ మనోజ్‌కుమార్, కోఆర్డినేటర్లు మహేష్, మన్మోహన్, సునీత, వివిధ కమిటీల కన్వీనర్లు, కో-కన్వీనర్లు పాల్గొన్నారు. సైన్స్ ఫెయిర్‌ను సందర్శించడానికి మొదటిరోజు హనుమకొండ, ఆత్మకూరు, హసన్‌పర్తి, శాయంపేట, వేలేరు, భీమదేవరపల్లి, పరకాల మండలాల నుంచి పెద్దసంఖ్యలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఇన్‌స్పైర్ విభాగంలో 93 ఎగ్జిబిట్స్, సైన్స్‌ఫెయిర్‌లో జూనియర్, సీనియర్ విభాగంలో 222 ఎగ్జిబిట్స్‌ను విద్యార్థులు ప్రదర్శించారు.

# విద్యార్థిని బ్లాక్‌మెయిల్ చేసి ఆమెపై ముగ్గురూ అత్యాచారం

బెంగళూరు డిసెంబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: కాలేజీ యువతిని ప్రేమ పేరుతో ఒక విద్యార్థి లోబర్చుకున్నాడు. అతడి స్నేహితులు దీనిని రికార్డ్ చేశారు. ముగ్గురూ బ్లాక్‌మెయిల్ చేసి ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు. బాధిత యువతి ఫిర్యాదుతో పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. కర్ణాటక రాజధాని బెంగళూరులో ఈ సంఘటన జరిగింది. మాగడి ప్రాంతానికి చెందిన 19 ఏళ్ల యువతి కాలేజీలో చదువుతున్నది. ఆరు నెలల కిందట కాలేజీ స్టూడెంట్ వికాస్‌తో ఆమెకు పరిచయం ఏర్పడింది.కాగా, ప్రేమ పేరుతో ఆ యువతిని వికాస్ లోబర్చుకున్నాడు. అతడి ఫ్రెండ్ ప్రశాంత్ ఇంటికి ఆమెను పలుమార్లు తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. మరో స్నేహితుడు చేతన్ దీనిని రికార్డ్ చేశాడు. ఆ ముగ్గురూ కలిసి సెప్టెంబర్ నుంచి ఆమెను బ్లాక్‌మెయిల్ చేశారు. తాము కోరినప్పుడల్లా ఆ రూమ్‌కు రావాలని బెదిరించారు. గత రెండు నెలలుగా ఆమెపై అత్యాచారానికి పాల్పడుతున్నారు.మరోవైపు వారి లైంగిక వేధింపులను ఆ యువతి భరించలేకపోయింది. డిసెంబర్ 17న పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఆ యువతికి తెలిసిన ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు పోలీస్ అధికారి తెలిపారు. నిందితుల్లో ఇద్దరు విద్యార్థులని వెల్లడించారు.

# మూగ జీవాలకు ఆహారం అందిస్తే వివిధ ప్రయోజనాలు

**- నొక్కి చెపుతున్న జోతిష్య శాస్త్రం...**

హైదరాబాద్ డిసెంబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );జీవ ఆవిర్భావం జరిగిన నాటి నుంచి జంతువులకు, మనుషులకు మధ్య విడదీయరాని సంబంధం ఏర్పడింది. ఇంకా ఒక్క మాటలో చెప్పాలంటే.. ఈ జీవుల్లో కొన్ని మనవుడి జీవితంలో భాగమైపోయాయి. ప్రతి పనిలో సహాయంగా ఉండడమే కాకుండా.. ఎప్పటికప్పుడు ఆవి మనిషి పట్ల విశ్వాసాన్ని చూపుతున్నాయి. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో జంతువులను పట్టించుకునే వారు కరువైపోతున్నారు. జోతిష్య శాస్త్రం ప్రకారం.. మూగ జీవాలకు ఆహారం అందిస్తే వివిధ ప్రయోజనాలు కలుగుతాయని అంటున్నారు.



### శునకాలు..

శునకాలు.. కేతు గ్రహంతో సంబంధం కలిగి ఉంటుంది. అందువల్ల మీ జీవితంలో ఏదైనా సమస్య ఉంటే.. లేదా పనులకు తీవ్ర అంతరాయం కలుగుతుంటే.. ప్రతి రోజు శునకాలకు ఆహారం పెట్టాలి. వీధి కుక్కలు అయినా సరే. అలా చేయడం వల్ల కేతు ప్రభావం తొలగిపోతుంది. అంతేకాకుండా.. ఇంట్లో కుక్కను పెంచుకోవడం వల్ల ప్రతికూల ప్రభావం సైతం దూరమవుతుంది.

### చేపలకు ఆహారం పెట్టడం వల్ల..

చేపను శ్రీవిష్ణువు ప్రతిరూపంగా భావిస్తారు. ప్రతి రోజు ఉదయం చేపలకు ఆహారం పెట్టడం శుభకరంగా భావిస్తారు. ఇవి గురు గ్రహంతో సంబంధం కలిగి ఉంటాయి. ప్రతి రోజూ చేపలకు ఆహారం పెట్టడం వల్ల చెడు గ్రహాల ప్రభావం నుంచి ఉపశమనం లభిస్తుంది. ఇంట్లో సానుకూల శక్తి సైతం నెలకొంటుంది.

### పిల్లులు..

రాహువుతో కనెక్ట్ అయి ఉంటాయి. పిల్లులు ఎదురు రావడాన్ని కొందరు అశుభంగా పరిగణిస్తారు. అందులో వాస్తవం లేదు. కేతు లేదా రాహు గ్రహం కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతుంటే.. ప్రతి రోజూ పిల్లులకు ఆహారం అందించడం వల్ల శుభం జరుగుతుంది. అలాగే పిల్లులను కొట్టడం, తిట్టడం వంటివి చేయకూడదు.

### ఆవు..

ఆవును శ్రీలక్ష్మీదేవి ప్రతిరూపంగా పూజిస్తారు హిందూ ధర్మం ప్రకారం గోవును తల్లిగా గౌరవిస్తారు. ప్రతి శుక్రవారం ఆవుకు పచ్చి గడ్డి తినిపిస్తే.. ఆ మహాలక్ష్మి దయ చూపిస్తుందంటారు. అంతేకాదు ఇంట్లో శుభం జరుగుతుందని చెబుతారు. నల్ల ఆవుకు ఆహారం అందించడం వల్ల శని అరిష్ట ప్రభావం సాధ్యమైనంతగా తగ్గుతాయని చెబుతారు.

### ఏనుగు..

ఏనుగు సైతం లక్ష్మీదేవితో సంబంధం కలిగి ఉంటుంది. వీటికి ఆహారం అందించడాన్ని పవిత్రంగా భావిస్తారు. ఏనుగు.. గురు గ్రహంతో సంబంధం కలిగి ఉంటుంది. నగదు సమస్యలు ఎదుర్కొంటుంటే.. ఏనుగుకు ఆహారం ఇవ్వడం శుభమని చెబుతారు. ఒక వేళ ఏనుగుకు ఆహారం అందించలేకున్నా.. దాని ఫొటోను ఇంట్లో పెట్టుకోవడం వల్ల ప్రయోజనం ఉంటుందని అంటారు.

### కోతి..

కోతిని హనుమంతుడికి ప్రతిరూపంగా భావిస్తారు. వీటికి ఆహారం పెట్టడాన్ని చాలా పవిత్రంగా భావిస్తారు. వీటికి అంగారక గ్రహంతో సంబంధం కలిగి ఉంటుంది. వీటికి అరటి పండ్లు అంటే అమితమైన ఇష్టం. ప్రతి మంగళవారం కోతులకు అరటి పండ్ల పెట్టడం వల్ల చాలా మంచి జరుగుతుంది. జీవితంలో సానుకూల ఫలితాలు అందుతాయని చెబుతారు.

# దమ్ముంటే.. 10 మందిని రాజీనామా చేయించు..

**-అమ్ముడు పోయిన ఎమ్మెల్యేల బతుకులు ఆగమాగం..**
**-పదవుల కోసం ఇంత దిగజారుతారా..**
**-ఐదు నిమిషాల్లోనే మాట మార్చిన రేవంత్..**
**-66 శాతం నమ్మకముంటే ఎన్నికలకు రండి..**
**-పంచాయితీ ఎన్నికలలో ప్రజలే బుద్ది చెప్పారు..**
**-బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 19:నేటినిజం (ప్రతినిధి): పంచాయితీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ వెంట ఉన్నారని చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్రెడ్డికి దమ్ముంటే.. నైతికత కలిగి ఉంటే బీఆర్ఎస్ నుంచి అక్రమంగా చేర్చుకున్న పది




మంది ఎమ్మెల్యేలతో తక్షణమే రాజీనామా చేయించి.. ఎన్నికలకు రావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు.

ఇవాళ రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నూతనంగా ఎన్నికైన బీఆర్ఎస్ సర్పంచ్ ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎవరి వైపు ఉన్నారో తేలాలంటే తన సవాల్ స్వీకరించాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట మార్చడంలో సిద్ధహస్తుడని విమర్శించారు.

హైదరాబాద్ ప్రెస్ మీట్లో రేవంత్ రెడ్డి మొదట కాంగ్రెస్ 66 శాతం గెలిచిందని, ఇది ప్రభుత్వంపై ప్రజల ఆశీర్వాదమని గొప్పలు చెప్పారు. కానీ, సరిగ్గా ఐదు నిమిషాలకే మాట మార్చి.. ఇవి స్థానిక అంశాలపై జరిగిన ఎన్నికలని, ప్రభుత్వానికి సంబంధం లేదని తప్పించుకున్నారన్నారు.

నిజంగానే 66 శాతం ప్రజాధరణ ఉంటే తన సవాల్ స్వీకరించాలని, మా పార్టీ నుంచి మీరు సంతలో పశువుల్లా ఎత్తుకెళ్లిన ఆ పది మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించాలని డిమాండ్ చేశారు. గతంలో మంత్రులుగా, స్పీకర్లుగా పనిచేసిన కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్ రెడ్డి వంటి వారు కేవలం గడ్డిపోచలాంటి పదవుల కొసం ఇంతలా దిగజారి వ్యవహరించడం సిగ్గుచేటన్నారు.

బయట కాంగ్రెస్లో చేరామని మైకుల్లో ప్రగల్భాలు పలికి, రాహుల్ గాంధీ కండువా కప్పారని చెప్పుకున్న ఈ పెద్ద మనుషులు.. ఇప్పుడు స్పీకర్ విచారణలో మాత్రం తాము బీఆర్ఎస్లోనే ఉన్నామని పచ్చి అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు.

పదవుల కోసం నూరు పట్టుకొని గబ్బిలాల్లా వేలాడుతున్న వీరి బతుకులు పూర్తిగా ఆగమైపోయాయన్నారు. సీఎం ఒత్తిడితో స్పీకర్ కూడా ఆధారాలను పక్కన పెట్టి అబద్ధాలు చెప్పాల్సిన దుస్థితికి నెట్టబడ్డారన్నారు. బయట కాంగ్రెస్ లో చేరామని చెప్పి, స్పీకర్ ముంగటకు పోయి తాము బీఆర్ఎస్ లోనే ఉన్నామని పచ్చి అబద్ధాలు చెప్తున్నారన్నారు.

ఆటలో అంపైర్ గా ఉండాల్సిన స్పీకర్ కూడా తాము ఇచ్చిన ఆధారాలు పక్కన పెట్టి సీఎం చెప్పినట్టు అబద్ధాలు ఆడక తప్పని పరిస్థితుల్లోకి నెట్టబడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను, మహిళలను, బీసీలను మోసం చేసినందుకే ఈ పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ కు కర్రు కాల్చి వాత పెట్టారని వ్యాఖ్యానించారు.

అధికార యంత్రాంగాన్ని, పోలీసులను అడ్డం పెట్టుకుని కాంగ్రెస్ ఎన్ని కుట్రలు చేసినా.. ప్రజలు మాత్రం గులాబీ జెండా వైపే నిలిచారని స్పష్టం చేశారు. సిరిసిల్ల జిల్లాలో 117 పంచాయతీలకు గాను 80 చోట్ల బీఆర్ఎస్ గెలవడవే దీనికి నిదర్శనమన్నారు. సీఎం, మంత్రులు జిల్లాలు తిరిగినా, బెదిరించినా ప్రజలు మాత్రం కేసీఆర్ నాయకత్వాన్నే కోరుకుంటున్నారన్నారు.

పల్లెలు బాగుపడాలన్నా, అభివృద్ధి జరగాలన్నా కేసీఆర్ నాయకత్వమే శరణ్యమని ప్రజలు మరోసారి తేల్చి చెప్పారని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. బెదిరింపులకు, ఫోన్ కాల్స్ కు కార్యకర్తలు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని కేటీఆర్ భరోసా ఇచ్చారు.

గెలిచిన వారు, ఓడిపోయిన వారు కలిసి పనిచేయాలని, వచ్చే ఏడాదిలో కొత్తగా సభ్యత్వ నమోదు, గ్రామ, మండల, జిల్లా కమిటీలు వేసుకుంటాం. పాత తరం అనుభవం, కొత్త రక్తం కలిసేలా చాకుల్లాంటి పిల్లలతో కమిటీలు వేసి పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు. రాబోయే జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికల్లో కూడా ఇదే ప్రభంజనం కొనసాగిస్తామని పిలుపునిచ్చారు.

## 'ఆదర్శప్రాయుడు అక్కిరాజు వెంకట్రావు'

నల్గొండ, డిసెంబర్ 19:కోదాడ పబ్లిక్ క్లబ్ అభివృద్ధిలో అక్కిరాజు వెంకట్రావు చేసిన సేవలు చిరస్మరణీయమని క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గాయం పట్టాభిరెడ్డి, బొల్లు రాంబాబు అన్నారు. శుక్రవారం పబ్లిక్ క్లబ్ ఆవరణలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన క్లబ్ శాశ్వత సభ్యుడు అక్కిరాజు వెంకట్రావు చిత్రపటానికి సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్లబ్ అభివృద్ధికి వెంకట్రావు చేసిన సేవలను స్మరించారు. రెండు నిమిషాలు మౌనం పాటించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ చింతలపాటి చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ పారా సీతయ్య, ఓరుగంటి రవి, మేకల వెంకటరావు, హరిబాబు, చింతలపాటి శ్రీను, పోటు రంగారావు, వేనేపల్లి శ్రీనివాసరావు, వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

# దేశ రాజధాని ఢిల్లీని ఉక్కిరిబిక్కిరి చేస్తోన్న వాయు కాలుష్యం



న్యూ ఢిల్లీ డిసెంబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );దేశ రాజధాని ఢిల్లీని వాయు కాలుష్యం ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. శుక్రవారం ఉదయం గాలి నాణ్యత సూచిక 380కి పడిపోయింది. తీవ్ర కాలుష్యంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాలుష్యానికి తోడు నగరాన్ని దట్టమైన పొగమంచు కమ్మేసింది. దీంతో విజిబిలిటీ దారుణంగా పడిపోయింది. ఫలితంగా వాహనాల రాకపోకల కు తీవ్ర అంతరాయం ఏర్పడింది .దృశ్యమానత పడిపోవడంతో ఇవాళ ఉదయం ఢిల్లీకి రాకపోకలు సాగించే దాదాపు 152 విమానాలు రద్దయ్యాయి. వాటిలో 79 డిపార్చర్స్ కాగా, 73 అరైవల్స్ ఉన్నాయి. మరికొన్ని విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. దీంతో ప్రయాణికులకు ఢిల్లీ ఎయిర్‌పోర్టు కీలక అడ్వైజరీ జారీ చేసింది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా పలు విమానాలు రద్దుకాగా, మరికొన్ని ఆలస్యంగా నడుస్తున్నట్లు తెలిపింది. ప్రయాణికులు ఎయిర్‌పోర్టుకు వచ్చే ముందు ఫ్లైట్ స్టేటస్‌ను చెక్ చేసుకోవాలని సూచించింది. ఇండిగో, ఎయిర్ ఇండియా సహా పలు విమాన యాన సంస్థలు కూడా తమ ప్రయాణికులకు ఇలాంటి సూచనలే చేశాయి. ప్రస్తుతం ఢిల్లీ-ఎన్సీఆర్, నోయిడా, ఘజియాబాద్‌లో దృశ్యమానత 100 మీటర్లుగా ఉంది.ఢిల్లీలోని 39 ఎయిర్ మానిటరింగ్ స్టేషన్లలో ఏకంగా 14 కేంద్రాల్లో ఏక్యూఐ లెవెల్స్ 400 కంటే ఎక్కువగానే నమోదయ్యాయి. అత్యధికంగా ఆర్కే పురంలో గాలి నాణ్యత సూచిక 447గా నమోదైంది. ఆ తర్వాత ఆనంద్ విహార్, వివేక్ విహార్, సిరిఫోర్ట్ ప్రాంతాల్లో 442గా నమోదైంది. ద్వారకా సెక్టరా-8లో 429, నెహ్రూ నగర్‌లో 425, ఎన్ఎస్ఐటీ ద్వారకా ప్రాంతంలో 423, డాక్టర్ కర్ణిసింగ్ షూటింగ్ రేంజ్‌లో 423, ఓఖ్లా ఫేజ్-2లో 422గా ఏక్యూఐ లెవెల్స్ నమోదయ్యాయి.

# రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో భారీగా గంజాయిని పట్టివేత

హైదరాబాద్ డిసెంబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );హైదరాబాద్‌లోని రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో భారీగా గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఐటి ఉద్యోగుల టార్గెట్ చేసుకొని గంజాయి సరఫరా చేస్తున్న సోహెల్ అనే వ్యక్తిని మాదాపూర్ ఎస్ఓటి పోలీసులు పట్టుకున్నారు. సోహెల్‌ను అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 17 కేజీల గంజాయి, 2 గ్రాముల ఎండిఎంఎ డ్రగ్స్‌ను మాదాపూర్ ఎస్ఓటి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్ర లోని నాందేడ్ నుండి గంజాయి తెచ్చి ఐటి ఉద్యోగులకు సోహెల్ సరఫరా చేస్తున్నారు. సోహెల్‌తో పాటు గంజాయి వినియోగించిన 5 మంది కస్టమర్లను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది.

# కర్ణాటక లో సీఎం మార్పుపై ఇంకా కొనసాగుతూనే ఉన్న సందిగ్ధత



బెంగళూర్ డిసెంబర్ 19 (ఎక్సం ప్రెస్ న్యూస్ );కర్ణాటక లో సీఎం మార్పుపై సందిగ్ధత ఇంకా కొనసాగుతూనే ఉంది. త్వరలో కర్ణాటకలో సీఎం మార్పు ఉంటుందని, డీకే శివకుమార్ సీఎం అవుతారని డీకే వర్గం ప్రచారం చేస్తుండగా.. సీఎం మార్పు జరిగే అవకాశం లేదని, పూర్తిగా ఐదేళ్లు తానే సీఎంగా కొనసాగుతానని సిద్ధరామయ్య సంకేతాలు ఇస్తున్నారు. ఈ విషయంపై ఆయన తాజాగా మరోసారి స్పందించారు. అసెంబ్లీలో మాట్లాడుతూ.. సీఎం పదవి షేరింగ్‌కు సంబంధించి నాడు (అసెంబ్లీ ఎన్నికల్లో విజయం తర్వాత) ఎలాంటి ఒప్పందం జరగలేదని చెప్పారు.'నేను ఇప్పటికే ఒకసారి ఐదేళ్లు సీఎం పనిచేశాను. ఆ తర్వాత మళ్లీ ముఖ్యమంత్రిని అయ్యాను. నాకు తెలిసినంతవరకు పార్టీ అధిష్ఠానం నాకే అనుకూలంగా ఉంది. సీఎం పదవిని ఇద్దరు వ్యక్తులు 2.5 ఏళ్ల చొప్పున పంచుకోవాలనే ఒప్పందమేదీ జరగలేదు' అని సిద్ధరామయ్య వ్యాఖ్యానించారు. అసెంబ్లీలో ప్రతిపక్షాల కామెంట్స్‌కు స్పందనగా.. ఐదేళ్లు తానే సీఎంగా కొనసాగుతానని సిద్ధరామయ్య చెప్పడం గత నాలుగు రోజుల్లో ఇది రెండోసారి.గత మంగళవారం కూడా ఆయన అసెంబ్లీలో ప్రతిపక్ష ఎమ్మెల్యేల కామెంట్స్‌కు స్పందిస్తూ.. 'ఇప్పుడు మళ్లీ చెబుతున్నా. ప్రస్తుతం నేను రాష్ట్ర ముఖ్యమంత్రిని, ఇక ముందు కూడా నేను ముఖ్యమంత్రిగా ఉంటా' అని వ్యాఖ్యానించారు. కాగా సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం శివకుమార్ మధ్య వివాదం చాలారోజులుగా కొనసాగుతోంది. ఈ విషయం హైకమాండ్ సైతం జోక్యం చేసుకుని సయోధ్య కుదిర్చింది. అయినా ప్రయోజనం లేదు. సీఎం మార్పు ఉంటుందని ప్రచారం జరుగుతూనే ఉంది.

# ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వైఎస్సార్ కడప జిల్లాలో దారుణం

## -వేంపల్లి ప్రభుత్వ బాలికల పాఠశాలలో 8వ తరగతి మైనర్ బాలిక ప్రసవం

అమరావతి డిసెంబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వైఎస్సార్ కడప జిల్లాలో దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. పులివెందులలో మైనర్ బాలిక ప్రసవించింది.

వేంపల్లి ప్రభుత్వ బాలికల పాఠశాలలో మైనర్ బాలిక 8వ తరగతి చదువుతుంది. బాలిక గర్భం దాల్చిన విషయాన్ని కుటుంబ సభ్యులు గోప్యంగా ఉంచారు. గురువారం మైనర్ బాలికకు పురిటి నొప్పులు రావడంతో వేంపల్లిలోని ఇంటి వద్ద ప్రసవం చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

పరిస్థితి విషమించడంతో పులివెందుల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మైనర్ బాలిక ఆడపిల్లకు జన్మనిచ్చింది. పోలీసులు కుటుంబ సభ్యులను విచారిస్తున్నారు.

# పది రూపాయాలు ఇవ్వలేదని ఓ వ్యక్తిని చంపిన బాలుడు

అమరావతి డిసెంబర్ '19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: మద్యం తాగడానికి పది రూపాయాలు ఇవ్వలేదని ఓ వ్యక్తిని బాలుడు చంపాడు. ఈ సంఘటన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడ నగరంలోని కొత్తపేటలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తాతాజీ(48) అనే వ్యక్తిని మద్యం తాగడానికి పది రూపాయాలు ఇవ్వాలని ఓ బాలుడు (17) అడిగాడు. డబ్బులు ఇవ్వకపోవడంతో ఇద్దరు మధ్య వాగ్వాదం జరిగింది. ఘర్షణ తారాస్థాయికి చేరుకోవడంతో కత్తి తీసుకొని తాతాజీని బాలుడు పొడిచాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది.

# టీహబ్, టీవర్క్స్ లలో స్టార్టప్ లకు కిడ్స్ కాన్వెంట్ విద్యార్థుల ప్రాజెక్టులు



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 19:నేటినిజం (ప్రతినిధి): వేములవాడలోని కిడ్స్ కాన్వెంట్ హై స్కూల్ లో చదువుతున్న విద్యార్థులు గురువారం రోజున హైదరాబాద్ మాదాపూర్ లో ఉన్న టీహబ్ ని, టీ వర్క్స్ ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు వివిధ ప్రాజెక్ట్ లను తీసుకెళ్లారు. ఈ ప్రాజెక్టులని హైదరాబాదులోని టీ హబ్ ఎక్స్పర్ట్స్ పరిశీలించి, వాటిని మాడిఫికేషన్ స్టార్ట్ అప్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు సిహెచ్ రితీష్ కుమార్, సిహెచ్ నంద దత్త, అరవ తరగతికి చెందిన డి శ్రీవర్ధన్ ఎన్ ఆర్యనందన్, 9వ తరగతికి చెందిన వి వైష్ణవి, బి వెన్నెల, యు కీర్తి, బి శ్రీనిద్ లను టీ హబ్ టీ వర్క్స్ ఇంచార్జ్ , కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అభినందించారు. ఈ ప్రాజెక్టుల తయారీకి సహకరించిన కిడ్స్ కాన్వెంట్ హై స్కూల్ సైన్స్ టీచర్ కే వెన్నలని టీ హబ్ వారు ప్రశంసించారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల ప్రాజెక్టులు స్టార్ట్ అప్ ప్రాజెక్టులుగా ఎంపిక కావడం ఎంతో గర్వకారణం అని కరస్పాండెంట్ నరాల దేవేందర్ అన్నారు. ఇలాంటి ఎన్నో ప్రాజెక్టులను తయారు చేయడమే లక్ష్యం అని ప్రిన్సిపల్ దరక్షన్ వసూపియా తెలియజేశారు.

# వేస్ట్ టు వెల్త్ లో కిడ్స్ కాన్వెంట్ విద్యార్థుల ప్రాజెక్టులకు ప్రశంస



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 19:నేటినిజం (ప్రతినిధి): వేములవాడలోని గవర్నమెంట్ హై స్కూల్లో శుక్రవారం రోజున వేస్ట్ టు వేల్త్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కిడ్స్ కాన్వెంట్ హై స్కూల్ విద్యార్థులు వివిధ ప్రాజెక్ట్స్ ని ప్రదర్శించారు. ఈ ప్రాజెక్టులను ఉపాధ్యాయులు పరిశీలించి, సర్టిఫికెట్స్, నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను కిడ్స్ కాన్వెంట్ హైస్కూల్ టీచర్స్ యాజమాన్యం అభినందించింది.

# భారత ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్‌కు ఘన స్వాగతం

హైదరాబాద్ డిసెంబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్);భారత ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ కు ఘన స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ శుక్రవారం భారత ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ కుటుంబ సమేతంగా కలిసి శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు ఢిల్లీ నుండి ప్రత్యేక విమానంలో శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకుని, అక్కడి నుండి నేరుగా రోడ్డు మార్గాన శ్రీశైలం దర్శనానికి వెళ్తూ మార్గమధ్యంలో నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మున్ననూర్ గ్రామ పరిధిలో ఉన్న తెలంగాణ టూరిజం మృగవాణి గెస్ట్ హౌస్ కు చేరుకున్న భారతదేశ ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ కు నాగర్ కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ గణపట్ రావు పాటిల్, నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ కే కార్తీక్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. కాసేపు విరామం తర్వాత నేరుగా శ్రీశైలం దర్శనానికి బయలు దేరి వేళ్ళారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వి అమరేందర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ పాఠశాల వార్షికోత్సవ వేడుకలు

కరీంనగర్, డిసెంబర్ 19: (నేటినిజం ప్రతినిధి) కొత్త పల్లి ఈ టెక్నో స్కూల్ వార్షిక వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి హాజిరై మాట్లాడారు .ప్రారంభానికి ముందు వారు ప్రాంగణంలో ఏర్పాటు చేసినటువంటి సరస్వతి మాత విగ్రహానికి పూజ కార్యక్రమాన్ని నిర్వహించి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను అట్టహాసంగా ప్రారంభించి విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు చక్కటి ప్రణాళికలను రూపొందించి వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ చదువులో రాణించి ఉత్తమ స్థానాలలో స్థిరపడాలని మరియు తల్లిదండ్రుల ఆశాయులకు అనుగుణంగా కృషి చేయాలని వారు సూచించారు. చిన్నతనం నుండి చదువు పట్ల మక్కువ పెంచుకొని సమాజంలో ఏదో ఒక అద్భుతమైన స్థానంలో స్థిరపడాలని కోరికను దృఢపరుచుకొని నేడు మన కరీంనగర్ జిల్లాకు కలెక్టర్ గా వ్యవహరిస్తున్నాని చెప్పారు. తల్లిదండ్రులు వారి పిల్లల యొక్క కార్యకలాపాలను పరిశీలించాలని మరియు తగిన సందర్భాలలో సలహాలు ఇవ్వాలని చెప్పారు. భారత దేశంలో అభివృద్ధి శరవేగంగా జరుగుతుందని ఈ అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు విద్యతో పాటు పలు నైతిక విలువలను పట్ల విస్తృతంగా అవగాహన కల్పించడం చాలా గొప్ప విషయమని తెలుపుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికై నరేందర్ రెడ్డి చేస్తున్నటువంటి కృషి చాలా స్ఫూర్తిదాయకమని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదని చెప్పారుఅల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ నరేందర్ రెడ్డి సారథ్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అల్ఫోర్స్ విద్యా సంస్థలు ముందంజలో నిలుస్తున్నాయని కొనియాడారు. విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తరగతి గదిలో నేర్చుకున్న విషయాలను సాధన చేయడమే కాకుండా వాటిలో పట్టు సాధించేందుకు కృషి చేయాలని సూచించారు తల్లిదండ్రులు ఏర్పరిచిన లక్ష్యాలను సాధించాలని కోరారు. సమయాన్ని వృధా చేయకుండా ప్రణాళికల రూపొందించుకొని లక్ష్యం వైపు పయనించాలని వారు చెప్పారు ఇటీవల కాలంలో మన దేశంలోనే పలు ప్రాంతాల్లో సందర్శించిన ఫుట్బాల్ దిగజం మెస్సిలాంటి క్రేజీ ను సంపాదించుకోవాలని ఉదాహరణ చెప్పారు. మన కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేల సత్పతి మీకు గొప్ప స్ఫూర్తి మరియు మార్గదర్శకమని ప్రశంసించారు. నేటి కాలంలో విద్యార్థులకు నైతిక విలువల చాలా అవసరమని మరియు వాటి ద్వారానే విద్యార్థులకు ఖ్యాతి వస్తుందని చెప్పారు. విద్యాసంస్థల ఆరంభం నాటి నుండి విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు విజయం సాధించే విధంగా ప్రోత్సాహం అందిస్తున్నామని చెప్పారు. విద్యా సంస్థల అభ్యున్నతికై అహర్నిశలు కృషి చేస్తున్న సిబ్బందికి మరియు ప్రోత్సాహం అందిస్తున్న తల్లిదండ్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వేడుకలలో భాగంగా విద్యార్థుల ప్రదర్శించినటువంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు మన దేశ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచాయి.జిల్లా కలెక్టర్ బయోపిక్ స్ఫూర్తిదాయకంగా నిలిచింది మరియు మార్గదర్శకంగా కొనసాగింది. పలు నృత్యాలు శివతాండవం, శ్రీకృష్ణుని మాయా లీలలు, , మహిషాసురమర్ధిని మహత్యం, మరాఠా రాజు శివాజీ జీవిత చరిత్ర, స్వాతంత్ర ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన తనాజీ, అపూర్వమైన కథక్ రామలీల, హనుమాన్ చాలీసా విశిష్టత, చారిత్రాత్మక ఆపరేషన్ సింధూర్, పల్లె వాతావరణం తలపించిన పల్లె అందాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వార్షిక ప్రణాళికలో భాగంగా వివిధ పరీక్షల్లో మరియు క్రీడల పోటీలలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు మరియు శుభాకాంక్షలు తెలియజేశారు. అత్యంత వేడుకగా నిర్వహించి నటువంటి ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు,విద్యార్థులుపాల్గొన్నారు.






# గోపరపల్లి సర్పంచ్ గా ఎన్నికైన మద్దేవేని రవి యాదవ్ కు బియ్యపు శంకర్ యాదవ్ అభినందనలు

హైదరాబాద్ డిసెంబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ )ల;ఇటీవల తెలంగాణ లో జరిగిన పంచాయతీ ఎన్నికలలో పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం గోపరపల్లి గ్రామపంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ గా ఎన్నికైన మద్దేవేని రవి యాదవ్ కు తెలంగాణ రైతు హక్కుల సాధన సమితి రాష్ట్ర కార్యదర్శి బియ్యపు శంకర్ యాదవ్ అభినందనలు తెలియచేసారు. ప్రజలకు అందుబాటులో వుంటూ, గ్రామ సమస్య లను సకాలంలో పరిష్కరిస్తూ, ముఖ్యంగా రైతు లకు అండగా వుంటూ, సర్పంచ్ పదవి కి వన్నె తేవాలని గోపరపల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చి దిద్దిదాలని కోరారు.

# గెలిచినా, ఓడినా ప్రజలకు అందుబాటులో ఉండాలి....

## -తిమ్మాపూర్ బీజేపీ మండల ఎన్నికల ఇంచార్జి నరహరి లక్ష్మారెడ్డి.



కరీంనగర్, డిసెంబర్ 19: (నేటినిజం ప్రతినిధి) స్థానిక ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు గెలిచిన వారైనా, ఓడిపోయిన వారైనా ప్రజలకు అందుబాటులో ఉండాలని స్థానిక సంస్థల బీజేపీ మండల ఇంచార్జి నరహరి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో బీజేపీ మండల అధ్యక్షులు సంగుర్తి జగదీశ్వరాచారి అధ్యక్షతన శుక్రవారం కొత్తపల్లి లో సమీక్ష నిర్వహించారు.రాంహన్మాన్ నగర్ సర్పంచ్ గా పిస్క సౌజన్య కిషోర్, ఉప సర్పంచ్ అందె శేఖర్, వార్డు సభ్యులు ఉప్పులేటి ప్రవీణ్, గుంటుక లత, వచ్చునూర్ వార్డు సభ్యులు వీణవంక అంజి, గొల్లపల్లి వార్డు సభ్యులు మారం శివాణి, పోరండ్ల వార్డు సభ్యులు నాంపల్లి సత్తయ్య, పతాకుల చుక్కయ్య, మల్లాపూర్ వార్డు సభ్యులు తాళ్లపల్లి నందకిశోర్, గొల్లన అనిల్, బాలయ్యపల్లి వార్డు సభ్యులు జాడి రాజు లకు మండల పార్టీ పక్షాన శాలువాల తో సన్మానం చేసారు.ఓటమిపాలైన వారి కష్ట సుఖాలు తెలుసుకొని, పార్టీ అండగా ఉంటుందని భరోసా కలిపించినట్లు మండల అధ్యక్షులు తెలిపారు. ప్రతీ గ్రామం లోని బూత్ ల వారిగా పార్టీ ని పటిష్టం చేసుకొని ఓటు ను పొందాలని అన్నారు. ప్రతీ గ్రామం లో జరిగే అభివృద్ధి నిధులన్నీ కేంద్రం లోని ప్రధాని నరేంద్ర మోదీ ఇస్తున్నవేనని వాటిని అత్యధికంగా తీసుకురావడానికి స్థానిక ఎంపీ,కేంద్ర మంత్రి బండి సంజయ్ సిద్ధంగా ఉన్నారని తెలిపారు.జిల్లా కార్యవర్గ సభ్యులు బూట్ల శ్రీనివాస్, మండల కార్యదర్శులు కిన్నెర అనిల్, గొట్టిముక్కల తిరుపతి రెడ్డి, బిజెవైఎం అధ్యక్షులు గడ్డం అరుణ్, కిసాన్ మోర్చా నాయకులు వేల్పుల రవీందర్,కొయ్యడ శ్రీనివాస్,బుర్ర శ్రీనివాస్, వేల్పుల ఓదయ్య, రామిడి మహేందర్ రెడ్డి, తక్కిటి దేవేందర్ రెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com